

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 30-04-2025 | సంపుటి - 22 | సంచిక - 365 | రూ : 4 | పేజీలు: 8


## సీఎంను కదిలించిన పర్శ సాయి దీనగాథ

- తగిన సహాయ సహకారాలు అందించాలని అధికారులకు ఆదేశం



2లో



## పాక్ మోసపూరిత దేశమని మళ్లీ స్పష్టమైంది

- భారత నౌకాదళం స్పష్టీకరణ
- విజయవంతంగా నౌకా విధ్వంసక క్షిపణి పరీక్షలు

2లో

## మిస్ వరల్డ్ పోటీలకు కట్టుదిట్టమైన భద్రత

- అతిథులకు చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాల్ని చూపించాలి
- సమీక్షలో అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్:** రాష్ట్రం ఆతిథ్యం ఇస్తున్న మిస్‌వరల్డ్ 2025 పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి వస్తున్న వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని పోలీసు అధికారులకు స్పష్టంచేశారు. మిస్ వరల్డ్ పోటీలపై మంగళవారం ఆయన కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్షించారు. పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. మే 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పోటీలకు జరుగుతున్న ఏర్పాట్లపై అధికారులు సీఎంకు వివరించారు. 'విమానాశ్రయం, అతిథులు బస చేసే హోటళ్లు, కార్యక్రమాలు జరిగే ప్రదేశాల్లో పోలీసు అధికారులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలి. అందాల పోటీల్లో పాల్గొనేవారికి



తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ఏర్పాట్లు చేయాలి.

తరువాయి 2లో



## కొత్త సీజేఐగా జస్టిస్ గవాయ్ నియామకం

- 14న ప్రమాణం చేయించనున్న రాష్ట్రపతి

2లో

## కరెంటు ఛార్జీల పెంపు లేదు

- టారిఫ్ ఉత్తర్వు జారీచేసిన ఈఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ నాగార్జున్
- ఆర్థికలోటు రూ.20,151 కోట్లు ఉంటుందని డిస్కంల పిటిషన్
- విచారణ జరిపి రూ.13,499 కోట్లుగా నిర్ధారణ
- ఆ మొత్తాన్ని రాయితీగా ఇస్తామన్న ప్రభుత్వం

2లో



# సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ

- పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనపై నిర్ణయం భద్రతా బలగాలదే
- అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రధాని మోదీ
- త్రివిధ దళాల అధిపతులతో ఢిల్లీలో భేటీ - రక్షణ మంత్రి, సీడీఎస్, జాతీయ భద్రతా సలహాదారు హాజరు
- మధ్యవర్తిత్వానికి సిద్ధం: ఇరాస
- ఇరు దేశాలు సంయమనం పాటించాలి: చైనా
- ఐక్యరాజ్యసమితిలో భారత్, పాక్ ప్రతినిధుల పరస్పర ఆరోపణలు
- జమ్మూకశ్మీర్‌లో నియంత్రణ రేఖ వెంట ఐదో రోజూ పాక్ ఆర్మీ కాల్పులు
- పహల్గాం ఉగ్రదాడి నిందితుల కోసం కొనసాగుతున్న వేట

2లో



## వార్షిక రుణ ప్రణాళిక రూ.6.60 లక్షల కోట్లు

- వ్యవసాయరంగ లక్ష్యం రూ.3.06 లక్షల కోట్లు
- ఎస్‌ఎల్‌బీసీ సమావేశంలో ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వివిధ రంగాలకు రూ.6.60 లక్షల కోట్ల రుణాలు ఇవ్వాలని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ నిర్ణయించింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే.. 22శాతం అదనంగా రుణ ప్రణాళికను రూపొందించింది. సచివాలయంలో మంగళవారం జరిగిన 231వ ఎస్‌ఎల్‌బీసీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 202526 వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. 202425 రుణ ప్రణాళిక అమల్లో 127 శాతం వృద్ధి సాధించిన బ్యాంకర్లను అభినందించారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే సీఎం లక్ష్యానికి అనుగుణంగా వార్షిక రుణ ప్రణాళిక

తరువాయి 2లో

## నేడే తెలంగాణ టెన్త్ ఫలితాలు..

- మధ్యాహ్నం ఒంటి గంటకు విడుదల చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి

2లో



# సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ

ఉగ్రవాదాన్ని మట్టికరిపించాలన్నది జాతీయ సంకల్పమని, దీనిని నెరవేర్చేందుకు దృఢ నిశ్చయంతో ఉన్నట్లు మంగళవారం ఢిల్లీలోని తన నివాసంలో జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. అంతకుముందు సైనిక ఉన్నతాధికారులు పలు దఫాలుగా సమావేశమై వ్యూహాల్ని సమీక్షించారు. మరోవైపు సరిహద్దుల్లో పాకిస్థాన్ కవ్వింపు చర్యలను కొనసాగిస్తూనే ఉంది. వరుసగా ఐదో రోజూ (సోమవారం అర్ధరాత్రి) నియంత్రణ రేఖ వెంట కాల్పులు జరపగా భారత సైన్యం గట్టిగా తిప్పికొట్టింది. భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిపోతున్న నేపథ్యంలో వాటిని సడలింపజేయటానికి మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఐక్యరాజ్యసమితి (ఐరాస) సెక్రటరీ జనరల్ గుటెరస్ వెల్లడించారు. ఇరు దేశాలు సంయమనం పాటించాలని చైనా సూచించింది. దక్షిణాసియాలో భారత్, పాకిస్థాన్ రెండూ ముఖ్యమైన దేశాలని, శాంతి, సుస్థిరత, అభివృద్ధి సాధనకు సామరస్యంగా కలిసిమెలిసి ఉండాలని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ ఓ మీడియా సమావేశంలో అభిలషించారు. ఢిల్లీలో ప్రధాని మోదీ నివాసంలో నిర్వహించిన కీలక సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, త్రిదళాధిపతి (సీడీఎస్) అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజీత్ దోభాల్, ఆర్మీ, నేవీ, ఐఏఎఫ్ అధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దాదాపు గంట పాటు జరిగిన భేటీలో దేశంలో అంతర్గత భద్రతతో పాటు సరిహద్దులో నెలకొన్న పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. పహల్గాం ఉగ్రదాడి బాధ్యులను శిక్షించాలన్నది దేశ ప్రజల దృఢ నిశ్చయమని ప్రధాని మోదీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మన సైనిక దళాల సామర్థ్యాలపై సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. 'సీమాంతర ఉగ్రవాదం, దాని సూత్రధారులపై చర్యలు ఎప్పుడు, ఎలా తీసుకోవాలన్న విషయంలో సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని' అని స్పష్టం చేశారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అంతకుముందు కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నేతృత్వంలో ఉన్నతస్థాయి భద్రతా సమావేశం జరిగింది. సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) డైరెక్టర్ జనరల్ దల్జీత్ సింగ్ చౌధరి, జాతీయ భద్రతా దళం డీజీ భృగు శ్రీనివాసన్, అస్సాం రైఫిల్స్ డీజీ లెఫ్టినెంట్ జనరల్ వికాస్ లఖేడా, సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) అదనపు డైరెక్టర్ జనరల్ అనుపమా నీలేకర్ చంద్ర తదితరులు హాజరయ్యారని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశంలో చర్చించిన అంశాలు బయటకు తెలియరాలేదు.

### అఖ్నూర్ సెక్టార్‌లో కాల్పులు

పాకిస్థాన్ సైన్యం వరుసగా ఐదో రోజు రాత్రి కూడా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి కవ్వింపులకు దిగింది. అఖ్నూర్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ వెంబడి, కుప్వారా, బారాముల్లా జిల్లాలోని నియంత్రణ రేఖ వద్ద పాక్ కాల్పులకు తెగబడినట్లు భారత సైనిక వర్గాలు తెలిపాయి. పాక్ ఆర్మీ దుశ్చర్యను బలంగా తిప్పికొట్టామని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొన్నాయి.

### * జమ్మూకశ్మీర్‌లో 48 పర్యాటక ప్రాంతాల మూసివేత

పహల్గాం ఉగ్రదాడి నిందితులను పట్టుకునేందుకు భారత భద్రతా బలగాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. దీనికి ప్రతీకారంగా కశ్మీర్‌లో మరిన్ని విద్రోహ ఘటనలు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఉగ్రమూకలకు సంబంధించిన నిద్రాణ శక్తులు క్రియాశీలం అయినట్లు తెలిపాయి. దీంతో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా కశ్మీర్‌లో ఉన్న మొత్తం 87 పర్యాటక కేంద్రాల్లో 48 కేంద్రాలను మూసివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కశ్మీర్‌లోని ప్రధాన ప్రదేశాలు గుల్మార్గ్, సోనామార్గ్ ప్రాంతాలతో సహా పలు సున్నితమైన పర్యాటక ప్రదేశాల్లో భద్రతా దళాలు, స్థానిక పోలీసులు ప్రత్యేక బృందాలను మోహరించాయి.

### * రాడార్ వ్యవస్థలను తరలిస్తున్న పాక్

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా తమపై భారత్ వైమానిక దాడులు చేయొచ్చని భయపడుతోన్న పాకిస్థాన్ ఆ దిశగా చర్యలు చేపడుతోంది. దాడులను పసిగట్టడానికి సియాల్‌కోట్ ప్రాంతానికి పాకిస్థాన్ సైన్యం తన రాడార్ వ్యవస్థలను తరలిస్తున్నట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ సరిహద్దుకు 58కి.మీ. దూరంలో ఉన్న ఖోర్ కంటోన్మెంట్ వద్ద టీపీఎస్77 రాడార్ సైట్‌ను ఏర్పాటుచేసింది. టీపీఎస్77 మల్టీరోల్ రాడార్ (ఎంఆర్ఆర్) అత్యంత సామర్థ్యం గల వ్యవస్థ.

### * పాక్ ఎయిర్‌లైన్లకు భారత గగనతలం మూసివేత?

తమ గగనతలంపై భారత దేశ విమానాల రాకపోకలపై పాకిస్థాన్ నిషేధం విధించిన నేపథ్యంలో న్యూఢిల్లీ కూడా ప్రతీకార చర్యలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. పాక్ విమానయాన సంస్థలకు మన గగనతలాన్ని మూసివేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. పాక్ విమానాలు... కౌలాలంపూర్ సహా మలేసియాలోని ఇతర నగరాలు, సింగపూర్, థాయ్‌లాండ్ వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే మన గగనతలాన్ని దాటాల్సిందే. ఇప్పుడు భారత్ నిషేధం విధిస్తే.. దక్షిణాసియా ప్రాంతాలకు వెళ్లేందుకు చైనా లేదా శ్రీలంక మీదుగా విమానాలను మళ్లించాల్సి ఉంటుంది. అప్పుడు ప్రయాణ సమయం పెరగడంతో పాటు నిర్వహణకు అదనపు భారం పడుతుంది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన పాక్ ఎయిర్‌లైన్లకు ఇది మరింత శరాఘాతం కానుంది.

### * నేడు కేంద్ర క్యాబినెట్ భేటీ

కేంద్ర క్యాబినెట్ బుధవారం సమావేశం కానుంది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం జరుగుతున్న తొలి భేటీ కావడంతో దీనికి ప్రాధాన్యం ఏర్పడింది. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ప్రధాని మోదీ అధ్యక్షత వహించనున్నారు. గత వారం మంత్రిమండలి సమావేశం జరగలేదు. 23న భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశమై ఉగ్రదాడిని ఖండించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.

# పాక్ మోసపూరిత దేశమని మళ్లీ స్పష్టమైంది

ఐరాస: సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ భారత్‌లో హింసకు పాల్పడుతున్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయ వేదికపై భారత్ ఎండగట్టింది. ఐక్యరాజ్యసమితి (ఐరాస) లో పహల్గాం ఉగ్రదాడిని లేవనెత్తి.. దాయాదిపై విరుచుకుపడింది. న్యూయార్క్‌లోని ఐరాస కార్యాలయంలో సోమవారం జరిగిన 'ఉగ్రవాద అనుబంధ నెట్‌వర్క్ బాధితుల' కార్యక్రమంలో ఐరాస భారత డిప్యూటీ శాశ్వత ప్రతినిధి యోజన పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె పహల్గాం దాడి ఘటనను ప్రస్తావిస్తూ పాక్‌ను దుయ్యబట్టారు. "సీమాంతర ఉగ్రవాదానికి కొన్ని దశాబ్దాలుగా మేం బాధితులం. ఉగ్ర చర్యల వల్ల బాధితులు, వారి కుటుంబాలతో పాటు సమాజంపై ఎలాంటి దీర్ఘకాల ప్రభావం ఉంటుందో మాకు తెలుసు. ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్నామని, ఉగ్ర సంస్థలకు నిధులు సమీకరిస్తున్నామని ఇటీవల పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసీఫ్ చెప్పిన మాటలను యావత్ ప్రపంచం వింది. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నామని వారు బహిరంగంగా అంగీకరించినా.. ఎవరూ ఆశ్చర్యపోలేదు. పాక్ ఎలాంటి మోసపూరిత దేశమో దీన్ని బట్టి మరోసారి స్పష్టమైంది. ఆ దేశం అంతర్జాతీయ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోంది. ఉగ్రవాదం అంశంలో ప్రపంచం ఇకపై కళ్లు మూసుకుని కూర్చోదు" అని ఆమె హెచ్చరించారు. భారత్‌పై నిరాధార ఆరోపణలు చేయడానికి ఐరాసను పాక్ దుర్వినియోగం చేస్తోందని పటేల్ మండిపడ్డారు. పహల్గాంలో ఉగ్రదాడిని ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండించాయని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రపంచ దేశాధినేతలు భారత్‌కు మద్దతు పలికాయని, ఉగ్రవాదాన్ని అంతర్జాతీయ సమాజం ఎన్నటికీ అంగీకరించబోదని అన్నారు.

### * భారత్-పాక్ మధ్య చర్చలకు మద్దతిస్తాం: గుటెరస్

భారత్‌పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్, పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్‌తో ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఫోన్లో విడివిడిగా మాట్లాడారు. మరోవైపు భారత్‌పాక్ ఉద్రిక్తతలపై ఐక్యరాజ్యసమితి (ఐరాస) ఆందోళన వ్యక్తం చేసింది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తత తగ్గింపు, చర్చలను తిరిగి ప్రారంభించడానికి దోహదపడే అన్ని రకాల చర్యలకు మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు గుటెరస్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. "భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న పరిస్థితులపై తీవ్ర ఆందోళన చెందుతున్నాం. ఎలాంటి సమస్యలైనా నిర్మాణాత్మక చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవచ్చు. అందుకోసం ఎలాంటి మద్దతు

# కరెంటు ఛార్జీల పెంపు లేదు

హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202526)లో కరెంటు ఛార్జీల పెంపు లేదని, పాత పద్ధతిలోనే యథాతథంగా వసూలు చేయాలని డిస్కంలను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) ఆదేశించింది. ఈమేరకు కరెంటు ఛార్జీల టారిఫ్ ఉత్తర్వును మంగళవారం మండలి కార్యాలయంలో ఈఆర్సీ ఛైర్మన్ జస్టిస్ డి.నాగార్జున్ విడుదల చేశారు. ఈ ఉత్తర్వు గురువారం (మే 1) నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించారు. రాష్ట్రంలోని రెండు డిస్కంలు, రాజన్న సిరిసిల్లలోని సెస్‌తో కలిపి మొత్తం మూడు విద్యుత్ సంస్థల ఆర్థికలోటు రూ.13,499.41 కోట్లు ఉంటుందని ఈఆర్సీ తేల్చింది. ఈ ఏడాది ఆర్థికలోటు రూ.20,151 కోట్లు ఉంటుందని గత నవంబరులో డిస్కంలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరపగా.. అంతకు రూ.6,652 కోట్లు తక్కువగా రూ.13,499.41 కోట్లు ఉంటుందని వెల్లడైనట్లు ఛైర్మన్ తెలిపారు. వ్యవసాయ కరెంటు వినియోగం ఎక్కువగా ఉంటుందని భావించి డిస్కంలు ఎక్కువ లోటు చూపాయని, కానీ అంత ఉండదని ఈఆర్సీ విచారణలో నిర్ధారించినట్లు వివరించారు. మొత్తం ఆర్థికలోటు తీర్చడానికి రూ.13,499.41 కోట్లను రాయితీగా విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం రాతపూర్వకంగా తెలిపినందున ఛార్జీల పెంపునకు అనుమతించడం లేదని జస్టిస్ నాగార్జున్ వివరించారు.

### ఉత్తర్వులోని ముఖ్యాంశాలు...

* గృహ వినియోగ కరెంటు ఛార్జీల్లో రాయితీలకు రూ.1,896.81 కోట్లు, వ్యవసాయానికి ఉచితంగా ఇస్తున్నందుకు మరో రూ.11,602.60 కోట్లు ఇస్తామని ప్రభుత్వం వివరించింది. గత ఆర్థిక సంవత్సరం (202425)లో ఇచ్చిన రాయితీ సొమ్ముకన్నా ఇది 1999.89 కోట్లు (17.4%) అధికం.
* గృహజ్యోతి పథకంలో 50,52,167 ఇళ్లకు నెలకు 200 యూనిట్ల వరకు ఇస్తున్న ఉచిత కరెంటు కోసం ఈ ఏడాది ప్రభుత్వం రూ.1,922 కోట్లను చెల్లించనుంది.
* విద్యుత్ వాహనాల (ఈవీ) ఛార్జింగ్ స్టేషన్ కాంట్రాక్టులోడు పరిమితి ఇంతకాలం 56 కిలోవాట్లు ఉండగా దానిని 150 కిలోవాట్లకు పెంచడానికి ఈఆర్సీ అనుమతించింది.
* గ్రిడ్ సపోర్టు రుసుం ప్రస్తుతం నెలకు కిలోవాట్‌కు రూ.18.48 ఉండగా.. మే 1 నుంచి రూ.20.04కి పెంచడానికి అనుమతించింది.
* ఓపెన్ యాక్సెస్ వినియోగదారులు 24 గంటల ముందు నోటీసు ఇవ్వకుండా... కాంట్రాక్టు డిమాండుకన్నా అదనంగా కరెంటు వాడుకుంటే 10% అదనంగా ఛార్జీలను వసూలుచేస్తారు.



### * కరెంటు ప్రమాదాలపై అవగాహన పెరగాలి

కరెంటు ప్రమాదాల్లో ముఖ్యంగా యువత ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రజలకు అవగాహన కల్పించాలని డిస్కంలకు సూచించినట్లు జస్టిస్ నాగార్జున్ చెప్పారు. యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నిర్మాణం 2026 జనవరి నాటికి పూర్తవుతుందని, అప్పటివరకూ పూర్తిగా 4 వేల మెగావాట్ల కరెంటు రాదని, దానిని పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. పగటిపూట సౌరవిద్యుత్ ఉత్పత్తి ఎక్కువగా ఉంటున్నందున, రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉన్నట్లు కనిపిస్తోందని, కానీ రాత్రిపూట థర్మల్ విద్యుత్ ఎక్కువగా అవసరమని.. డిస్కంలు బయట కొనాల్సి వస్తుందని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే 2030 నాటికి రాష్ట్రంలో కరెంటు కొరత ఏర్పడుతుందన్నారు. దాన్ని అధిగమించడానికి కొత్త విద్యుత్కేంద్రాలతో కొనుగోలు ఒప్పందాలు చేసుకోవాలన్నారు.

## మిస్ వరల్డ్ పోటీలకు కట్టుదిట్టమైన భద్రత

(మొదటిపేజీ తరువాయి)

విభాగాల వారీగా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలి' అని సీఎం సూచించారు.

### పూర్తిస్థాయి ప్రణాళిక రూపొందించాలి

హైదరాబాద్ నగరంలో పెండింగ్‌లో ఉన్న బ్యూటిఫికేషన్ పనులను త్వరగా పూర్తిచేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మిస్‌వరల్డ్ 2025 ప్రారంభమయ్యే నాటి నుంచి పూర్తయ్యే వరకు చేపట్టే కార్యక్రమాలు, ఏర్పాట్లకు సంబంధించి పూర్తిస్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, డీజీపీ జితేందర్, పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, శాంతిభద్రతల అదనపు డీజీ మహేశ్‌భగవత్, హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

### నేడు విజయవాడకు సీఎం

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ఉదయం ఏపీ మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడి వివాహానికి హాజరయ్యేందుకు విజయవాడ వెళ్లనున్నారు. కృష్ణా జిల్లా కంకిపాడులో జరగనున్న వివాహ వేడుకలో పాల్గొన్న అనంతరం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారని సీఎంవో వర్గాలు తెలిపాయి.

## కొత్త సీజేఐగా జస్టిస్ గవాయ్ నియామకం

ఢిల్లీ: భారత నూతన ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నియమించారు. మే 14న ఆయన చేత రాష్ట్రపతి ప్రమాణం చేయిస్తారు. ప్రస్తుత సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా మే 13న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో 52వ సీజేఐగా జస్టిస్ బి.ఆర్.గవాయ్‌ని రాష్ట్రపతి నియమించినట్లు కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ మంగళవారం నోటిఫికేషన్ వెలువరించింది. 2019 మే 24 నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న ఆయన అనేక రాజ్యాంగ ధర్మాసనాల్లో సభ్యుడిగా చరిత్రాత్మక తీర్పుల్ని వెలువరించారు. సీజేఐగా ఆరు నెలలు కొనసాగి నవంబరు 23న పదవీ విరమణ చేస్తారు.

## సీఎంను కదిలించిన పర్శ సాయి దీనగాథ

హైదరాబాద్: జనగామలోని కుర్మవాడకు చెందిన పర్శ సాయి దీనస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. వారి కుటుంబానికి తగిన సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. 30 ఏళ్లుగా మంచానికే పరిమితమైన కుమారుడిని సాకలేకపోతున్నామంటూ సోమవారం జనగామ కలెక్టరేట్‌కు వచ్చిన పర్శ సాయి తల్లిదండ్రులు ప్రజావాణిలో మొరపెట్టుకున్నారు. ఈ ఘటనపై వచ్చిన వార్తలకు సీఎం స్పందించారు. 'పర్శ సాయి దీనస్థితి నా దృష్టికి వచ్చింది' అని సీఎం ఎక్స్‌లో పోస్టు చేశారు. యువకుడి ఆరోగ్య పరిస్థితి, తల్లిదండ్రుల ఆర్థిక స్థితిపై వివరాలు తెలుసుకుని ప్రభుత్వం వైపు నుంచి సహాయ సహకారాలు అందించాలని సీఎం జనగామ కలెక్టర్ రిజ్వాన్‌బాషాను ఆదేశించారు. కలెక్టర్ సూచనతో జనగామ ఆర్డీవో గోపీరాం, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మంగళవారం పర్శ సాయి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని, ఉపాధికి రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా సాయం లభిస్తుందని భరోసా ఇచ్చారు. సాయికి నిమ్స్ లో వైద్య సహాయం అందించాలని నిర్ణయించారు.

## నేడే తెలంగాణ టెన్త్ ఫలితాలు..

హైదరాబాద్: పదో తరగతి పరీక్షల ఫలితాలు బుధవారం వెల్లడి కానున్నాయి. రవీంద్రభారతి వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం ఒంటి గంటకు ఫలితాలను విడుదల చేస్తారని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు ఎ.కృష్ణారావు తెలిపారు. ఈసారి జీపీఏ విధానాన్ని తొలగించినందున సబ్జెక్టుల వారీగా మార్కుల గ్రేడ్లు ఇవ్వనున్నారు. కనీస మార్కులు వస్తే పాస్ అని, లేదంటే ఫెయిల్ అని మార్కుల మెమోపై నమోదుచేస్తారు. ఫలితాలను www.results.bsetelangana.org, rsults.bse.telangana.gov.in, తదితర వెబ్‌సైట్ల ద్వారా తెలుసుకోవచ్చు.

## వార్షిక రుణ ప్రణాళిక రూ.6.60 లక్షల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

రూపొందించామని బ్యాంకర్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాన్ని అధిగమించి రుణాలిస్తామని చెప్పారు. మహిళా పారిశ్రామికవేత్తలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, స్వయం సహాయక బృందాలకు విరివిగా రుణాలు అందిస్తామని వివరించారు. విద్యారుణాలు, గృహ రుణాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఎంఎస్ఎంఈ రంగానికి గత ఆర్థిక సంవత్సరంలో రూ.87 వేల కోట్లు రుణంగా ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించగా..రూ.95,620 కోట్లు ఇచ్చినట్లు బ్యాంకర్లు వివరించారు. వ్యవసాయ రుణాల్లో 116 శాతం వృద్ధి సాధించామని..గతేడాది ఖరీఫ్‌లో రూ.1,69,177 కోట్లు, రబీలో రూ.1,37,291 కోట్లు రుణంగా అందించామని నివేదించారు.

*** గత ఆర్థిక సంవత్సరంలో 2,54,527 మంది కౌలు రైతులకు రూ.4,411 కోట్ల రుణాలు ఇచ్చారు.**

### వృద్ధి ఎందుకు తగ్గుతోంది?

వార్షిక రుణ ప్రణాళిక అమలులో వృద్ధి ఎందుకు తగ్గుతోందని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బ్యాంకర్లను ప్రశ్నించారు. 202122 సంవత్సరం లక్ష్యంలో వృద్ధి 133 శాతం, 202223లో 163 శాతం, 202324లో 138 శాతం వృద్ధి ఉండగా.. 202425లో 127 శాతం మాత్రమే ఉండటాన్ని ప్రస్తావించారు.

## నైపుణ్య శిక్షణకు రాష్ట్రంలో ఆస్ట్రేలియా వర్సిటీ!

### * మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో ప్రతినిధుల చర్చ

హైదరాబాద్: రాష్ట్రంలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో నైపుణ్య శిక్షణ అందించే యూనివర్సిటీ ఏర్పాటుకు ఆస్ట్రేలియా వాణిజ్య ప్రతినిధులు ముందుకు వచ్చారని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నెలకొల్పుతున్న యంగ్ ఇండియా స్కిల్స్ విశ్వవిద్యాలయానికి తోడు మరో ఉన్నతస్థాయి టెక్నాలజీ క్యాంపస్ అందుబాటులోకి వస్తే యువతకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని ఆయన అన్నారు. మంగళవారం సచివాలయంలో తనను కలిసిన ఆస్ట్రేలియా ప్రతినిధులతో శ్రీధర్‌బాబు చర్చించారు. కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తున్నందున గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ)లలో పనిచేస్తున్న 3 లక్షల మందికి పైగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లతో పాటు, చదువులు పూర్తిచేసుకునే విద్యార్థులకు నూతన నైపుణ్యాలపై శిక్షణ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. "తమ యూనివర్సిటీ ద్వారా వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు సృష్టిస్తామని ఆస్ట్రేలియా ప్రతినిధులు చెబుతున్నారు.

# చరిత్రలో నిలిచిపోయే సన్న బియ్యం పథకం పేదలకు గొప్ప వరం

*** కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : చరిత్రలో నిలిచిపోయే సన్న బియ్యం పథకం పేదలకు గొప్ప వరం కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొత్త అంజిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జమ్మిగడ్డలోని రెండు రూపాయలకు కిలో బియ్యం లబ్ధిదారులు ఏరోళ్ల పద్మ ఇంట్లో సామూహిక భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సామాన్యుడికి మూడు పూటల సన్న బియ్యం భోజనం పెట్టడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సన్నబియ్యం పథకం పేదలకు వరంగా మారిందని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పేదల పక్షపాతిగా సన్న బియ్యం పథకాన్ని ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలోని కాంగ్రెస్ సర్కార్ అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి 200 యూనిట్లు, గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం పథకాల ద్వారా పేదలకు ఎంతో లబ్ధి చేపడుతుందన్నారు. ప్రభుత్వం కొలువు దీరిన అతి తక్కువ కాలంలోనే అద్భుత రీతిలో ప్రజాభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజాధారణ పొందుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం చేస్తున్న కృషి పట్ల లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో కలిసి సంతోషాన్ని పరమేశ్వర్ రెడ్డి పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్, కె.సీతారాంరెడ్డి, అల్లూరయ్య, పాకాల రాజు, మాజీ కౌన్సిలర్ కోర్డినేటర్ రాజేంద్రన్, విట్టల్ నాయక్, అజీజ్, లింగం, భూపాల్ రెడ్డి, శ్రీను, నర్సింహ, అనిల్, గుణ శేఖర్, రామ్ లింగం, పెద్ది నాగరాజు, సందీప్ గౌడ్,కిరణ్, ప్రకాష్, ఉష రాణి, మమ్మడి శ్రీను, రామలింగం, సంకు శ్రీకాంత్, డి. వెంకట్ రావు, మొక్క శ్రీను, రమేష్ చారి, రావు, భవాని, సంధ్య, సునీత, మీనా, రాణి, ఉమా, ప్రకాష్ రెడ్డి, సాయబ్, సలీం, ఖాదర్ వల్లి, దుబాయ్ రావు, మల్లా రెడ్డి, నరేందర్ గౌడ్,బాషా,రహ్మత్ ఉల్లా, సంతోష్ చారి, శివ, బాల్ నర్సిమా, వినోద్, కృష్ణ, ఏఎస్ రావు నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల కోసమే పోలీసులు

*** ఇతరమతాలను గౌరవించాలి**

*** ఎస్పీ పరితోష్ పంకజ్**



జిన్నారం, ప్రజాస్ఫూర్తి 29: ప్రజల సంరక్షణకే పోలీసులు ఉన్నారని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పి పరితోష్ పంకజ్ హెచ్చరించారు. ఇటీవల జిన్నారం జరిగిన ఘటన నేపథ్యంలో గురువారం శాంతి సమావేశాన్ని జిన్నారం గ్రామంలోనీ ఓ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్ హాజరయ్యారు. శివుడి మట్టి విగ్రహం ధ్వంసం, మదర్సా పై జరిగిన దాడి తదితర విషయాలపై స్థానిక నాయకులు, ప్రజలతో పోలీసులు చర్చించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ శాంతియుతంగా ప్రజలు వారి నిరసనలను వ్యక్తం చేయాలని సూచించారు. చట్టాన్ని అతిక్రమించి ఆందోళనలు నిర్వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రశాంతంగా ఉండే జిన్నారం గ్రామం పోలీసు పహారాలో ఉండడాన్ని తాము ఊహించలేకపోయామని తెలిపారు. మతవిద్వేషాలు ఎవరు కూడా సృష్టించవద్దని సూచించారు. మదర్సా పై దాడి చేసిన ఘటనలో హిందువులపై పెట్టిన కేసులను ఉపసంహరించాలని, మరికొంత మందిపై కేసులు పెట్టవద్దని స్థానిక నాయకులు ఎస్పీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సంజీవరావు, డీ ఎస్ పీ రవీందర్ రెడ్డి, సీఐ నయీముద్దీన్, ఎస్సై నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బి.యన్.రెడ్డి నగర్ కాలనీలో బాక్స్ డ్రైన్ పనులను పరిశీలించిన కార్పొరేటర్



ప్రజాస్ఫూర్తి, కాప్రా : బి.యన్.రెడ్డి నగర్ కాలనీలో బాక్స్ డ్రైన్ పనులను స్టాండింగ్ కమిటీ మెంబర్ చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అధికారులతో కలిసి మంగళవారం పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ బాక్స్ డ్రైన్ వల్ల వివిధ కాలనీలు వరద ముప్పుకు గురికావని నాణ్యతమైన పనిచేస్తూ త్వరగా పని పూర్తి చేయాలని కాంట్రాక్టర్ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు కాలనీ సంక్షేమ సంఘం నాయకులు మరియు కాంగ్రెస్ నాయకులు ఏ ఈ స్వరూప , వర్క్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కాలనీ అధ్యక్ష కార్యదర్శులు వెంకట్రాంరెడ్డి, కనకరాజు గౌడ్, రామచంద్రయ్య, వాసుదేవారెడ్డి, రంగారెడ్డి, వీరన్న ,నాగేష్, రాజశేఖర్ రెడ్డి, లక్ష్మణ్ చారి, తిరుపతయ్య ,మరియు ఏఎంసీ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## కొండ కోనల్లో నివసించే గిరిజనుల సంక్షేమమే ధ్యేయం

*** మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: అడవిని నమ్ముకుని జీవించే కొండ రేడ్ల గిరిజన కుటుంబాలకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా నెలకు ఒకసారి ఆ గ్రామాలను సందర్శించి వారి సమస్యలను తెలుసుకొని జిల్లా కలెక్టర్ , ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకొని వెళ్లి వారిని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం దమ్మపేట మండలం పూసుకుంట గ్రామానికి వెళ్లే మార్గంలో నాలుగు కోట్ల 18 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన కల్వర్టులను ఆయన ప్రారంభించారు. అనంతరం పూసుకుంట గ్రామములో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలలో నివసించే కొండరేడ్ల గిరిజన గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక విద్యా వైద్యం ,మౌలిక వసతుల కల్పనకు ఇబ్బందులు పడుతుండేవారని, వారి సమస్యలను దృష్టిలో పెట్టుకొని గత జనవరి మాసంలో ఫారెస్ట్ వారి అనుమతి తీసుకొని కల్వర్టుల నిర్మాణం కొరకు శంకుస్థాపనలు చేయడం జరిగిందని, నేడు ఆ కలవర్టులను ప్రారంభించి వర్షాకాలంలో ఈ గ్రామాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసామని, అలాగే బీటీ రోడ్డు పనులను కూడా త్వరగా ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ఈ గ్రామాలకు కరెంటు సౌకర్యం, రోడ్డు నిర్మాణం చేపట్టడానికి ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారు ఏమైనా అడ్డంకులు సృష్టిస్తే సంబంధిత ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకొని పోయి సమస్య పరిష్కరించుకోవాలని అన్నారు. అడవిని నమ్ముకొని జీవించే కొండరెడ్ల గిరిజనులు అటవీ ఫలాలు అమ్ముకొని జీవనోపాధి పెంపొందించుకోవడం వారి హక్కు అని వారిని అటవీక శాఖ అధికారులు ఎటువంటి ఇబ్బందులు పెట్టకూడదని అన్నారు. కొండరెడ్ల కుటుంబాల జీవనస్థితిగతులను అధ్యయనం చేసుకొని అధికారులు నిబద్ధతగా పనిచేయాలని, ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూసి వారు పిల్లాపాపలతో సుఖమైన జీవితం గడపాలని,పిల్లలందరూ విద్యావంతులు అయ్యేలాగా చూడాలని, గిరిజన రైతులకు పామాయిల్ తోటల పెంపకం, హార్టికల్చర్ కు సంబంధించిన సలహాలు సూచనలు, వెదురు సాగు, రైతులు ఆదాయ వనరులు సమకూర్చుకునే సలహాలు ఇచ్చి వారు సంవత్సరానికి రెండు పంటలు పండించుకునేలా చూడాలని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కంటే ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధిలో ముందడుగులో ఉందని, మన జిల్లాలో కావలసిన వనరులు ఎన్నో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.కొండకోనల్లోనివసించేఆదిమ గిరిజనుల సంక్షేమాన్ని ముఖ్యంగా విద్యా వైద్యం మౌలిక వసతుల కల్పనకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారుల సమన్వయంతో అభివృద్ధి దిశగా తీసుకుపోతున్నామని, పేద కుటుంబాలకు సన్న బియ్యం, గిరిజన నిరుద్యోగ యువకులకు రాజీవ్ యువ వికాస పథకం ప్రవేశ పెట్టడం జరిగిందని, చిన్నారులకు పౌష్టికారమైన ఆహారం అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఇప్పించడం జరుగుతుందని, గర్భిణీ స్త్రీలకు బాలామృతం అందజేస్తున్నామని అన్నారు. గిరిజన కుటుంబాల ఆరోగ్యపరంగా కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, ఈ గ్రామానికి రహదారి సౌకర్యం ఏర్పడినందున ఈ గ్రామంలోని గిరిజనులు అత్యవసర చికిత్సల కోసం ఆసుపత్రికి వెళ్లడానికి రెండు అంబులెన్స్లను ఐటీడీఏ ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన అన్నారు. కొండరెడ్ల గిరిజనులు జీవనోపాధి పెంపొందించుకొని కుటుంబాలను పోషించుకోవడానికి గత సమావేశంలో దరఖాస్తులు చేసుకున్న కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల విలువగల టెంట్ హౌస్, మైక్ సిస్టం తుమ్మల నారాయణమ్మ, యాట్ల కాంతారెడ్డి కుటుంబాలకు , తేనెను సేకరించి అమ్ముకోవడానికి 45 వేల రూపాయల విలువగల తేనే తయారీ బాక్సులు ఐదుగురికి 9 బాక్సుల చొప్పున అందించి వారికి తేనె సేకరణ గురించి శిక్షణ , బ్యాంబో క్రాఫ్ట్ తయారీ శిక్షణ ఉత్సాహవంతులైన యువతీ యువకులకు ఐటీడీఏ ద్వారా అందించడం జరుగుతుందని అన్నారు. అలాగే డ్రైవింగ్ శిక్షణ తీసుకున్న కొండరెడ్ల యువకులకు సంబంధిత పోలీస్ అధికారులు ఆర్టీవో తో మాట్లాడి వారికి డ్రైవింగ్ లైసెన్సులు అందేలా చూడాలని, భారతదేశంలో ఎక్కడా లభించని ఖనిజాలు కొత్తగూడెం జిల్లాలో దొరుకుతున్నాయని, గిరిజన యువతి యువకులు కొత్తగూడెంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ద్వారా మంచి ప్రావీణ్యం పొంది భూగర్భ జలాలలో ఉన్న ఖనిజాలను కనుగొనే విధంగా నైపుణ్యాన్ని పెంచుకొని వేరే దేశాలకు మన పేరు వ్యాప్తి చెందేలా చూడాలని అన్నారు. గిరిజన రైతులకు మేలు జరగాలంటే భూగర్భ జలాలు పెంపొందించుకుంటే మన భూములు సస్యశ్యామలం అవుతాయని అన్నారు. అశ్వరావుపేట ఎమ్మెల్యే చొరవతో 250 కోట్ల వ్యయంతో మోడల్ రెసిడెన్షియల్ కళాశాల నిర్మాణానికి సీఎం ఒప్పుకున్నందున 25 ఎకరాల ప్రభుత్వ భూమి అవసరం ఉందని ఆ భూమిని సేకరించి మోడల్ రెసిడెన్షియల్ కళాశాల శంకుస్థాపన త్వరలో ప్రారంభిస్తామని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ , ఐటీడీఏ పీవో బి. రాహుల్ మాట్లాడుతూ కొండరెడ్ల కుటుంబాల సంక్షేమం కోసం పూసుకుంట గ్రామంలోని గిరిజన రైతులకు ఆయిల్ ఫామ్ మొక్కలు 12 మంది రైతులకు అందించామని, ఐటీడీఏ ద్వారా కరెంటు , మోటార్లు పదిమందికి అందించి, పంటల రక్షణకు కంచె ఏర్పాటు చేయడం జరిగిందని, ఆయిల్ ఫామ్ తోటలు పెరగగానే అంతర్ పంటలుగా కూరగాయల మొక్కలు, మునగ చెట్లు వేసుకునేలా సలహాలు సూచనలు అందించడం జరిగిందని, ఈ గ్రామంలో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నడపబడుతున్న పాఠశాలలో ఇద్దరు టీచర్లను నియమించి గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామని, రాజీవ్ యువ వికాస పథకానికి 19 మంది యువకులు దరఖాస్తులు చేసుకున్నారని, ఈ దరఖాస్తులు వ్యవసాయానికి సంబంధించి , కిరాణా షాపులు, ఫ్యాన్సీ స్టోర్ లు కొరకు ఉన్నందున వారికి తప్పనిసరిగా అందే విధంగా చర్యలు తీసుకుంటామని, మహిళా సంఘాలకు తేనె పెంపకం శిక్షణ, వెదురుతో తయారు చేసే కళాఖండాల శిక్షణ అందిస్తామని, కొండరెడ్ల అభ్యున్నతికి ఐటీడీఏ తరఫున సహకారం అందించడానికి సంబంధిత అధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని వారు అన్నారు. అనంతరం టెంట్ హౌస్, సౌండ్ సిస్టం సామాగ్రి, తేనె సేకరించే బాక్సులను మంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు.ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, శిక్షణ కలెక్టర్ శర్మ, ఎస్పీ రోహిత్ రాజ్, ఆర్డీవో మధుసూదన్, ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశ్వరరావు, డిపిఓ చంద్రమౌళి, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ తిరుమలరావు, ఎస్సీ ఎన్పీడీసీఎల్ రమేష్, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్వో రామలక్ష్మి, మిషన్ భగీరథ ఈ ఈ నళిని, పి ఆర్ డి ఈ చంద్రమౌళి, ఐటీడీఏ సహాయ ప్రాజెక్ట్ అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, పి వి టి జి అధికారి నరేష్, డిటిఆర్ఓ ఎఫ్ ఆర్ లక్ష్మీనారాయణ, ఎస్ ఓ ఉదయ భాస్కర్, జేడీఎం హరికృష్ణ, ఇతర శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీసీఎస్ పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఈ నెల 26వ తేదీన తెలంగాణ రాష్ట్ర డిజిపి జితేందర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్న జిల్లా సిసిఎస్ పోలీస్ అధికారులు, సిబ్బందిని మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణాను సమర్థవంతంగా అడ్డుకొని నిందితులను పట్టుకోవడంలో బాధ్యతగా విధులు నిర్వర్తించినందుకు గాను రాష్ట్ర డిజిపి వీరికి ప్రశంసా పత్రాలను అందజేయడం జరిగింది.ఆంధ్రాఒరిస్సా అటవీ ప్రాంతాల నుండి అక్రమార్జనే ధ్యేయంగా ప్రభుత్వ నిషేధిత గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసినందులకుగాను రాష్ట్రంలోనే అధికంగా భద్రాది కొత్తగూడెం జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందికి నగదు రివార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.ఎవరైనా ప్రభుత్వ నిషేధిత గంజాయిని రవాణా చేసినా,విక్రయించినా,కొనుగోలు చేసినా అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.గంజాయి అక్రమ రవాణా గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి తెలియజేయాలని ఈ సందర్భంగా ఎస్పీ కోరారు.ఈ కార్యక్రమంలో సీసీఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్,ఎస్సైలు ప్రవీణ్,రామారావు , సిబ్బంది రవి,విజయ్,రామకృష్ణ,భాస్కర్, వెంకటనారాయణలు పాల్గొన్నారు.

## గ్రామదేవతల ఆరాధన తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం

*** టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి జిల్లా పరిధిలోని లక్ష్మీదేవిపల్లి మండలంలో తెలగ రామవరం గ్రామపంచాయతీ హరిజనవాడలో నూతనంగా కొలువైన ముత్యాలమ్మ తల్లిని, బొడ్రాయి లను టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలంత శుభిక్షంగా ఉండాలన్నారు. గ్రామ దేవతలను ఆరాధించడం మన తెలంగాణ ప్రజల సంస్కృతి సాంప్రదాయాలన్నారు. గ్రామ దేవతల ఆశీస్సులు ఇక్కడి ప్రజలకు ఎల్లకాలం ఉండాలన్నారు. ప్రతి ఏడాది ముత్యాలమ్మ తల్లి పండుగ నిర్వహిస్తూ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించాలన్నారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు నాగా సీతారాములును శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఓబిసి కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు జయప్రకాష్,ఓబీసీ నాయకులు బొబ్బాల.వెంకట్ యాదవ్, ఉమ్మడి కారుకొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ యాసరపు నరసింహరావు, మాలోత్ బలరాం, మార్ల.శ్రీనివాస్,ఏనుగుల. వెంగలరావు,బండ.వెంకటేశ్వర్లు, కంకిపాటి.సతీష్, బొల్లం. రమేష్, విందారరావు వెంకటేశ్వర్లు, పోతురాజు.వెంకన్న, కండె. రాములు, సోషల్ మీడియా సాయిచంద్, స్థానిక నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదం మానవత్వానికి వ్యతిరేకం

*** రేఖి థెరపీ గ్రాండ్ మాస్టర్ లక్ష్మి కమలాకర్**




కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : ఉగ్రవాదం మానవత్వానికి వ్యతిరేకమని రేఖి థెరపీ గ్రాండ్ మాస్టర్ లక్ష్మి కమలాకర్ అన్నారు. జమ్మూ కాశ్మీర్లోని పహల్గాం ప్రాంతంలో ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడిలో అమాయకుల ప్రాణాలు కోల్పోవడంపై రాందేవ్ రావు ఆసుపత్రి , కుముదిని దేవి స్కూల్ అండ్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ దమనకాండను తీవ్రంగా ఖండిస్తూ, ఉగ్రవాదాన్ని దేశం నుండి నిర్మూలించాలంటూ ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, పలువురు ప్రముఖులు కోరారు. ఈ కార్యక్రమానికి రేఖి థెరపీ గ్రాండ్ మాస్టర్ లక్ష్మి కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ఊపి ర్యాలీకి శ్రీకారం చుట్టారు.అనంతరం ఆమె మాట్లాడుతూ. మతాలు వేర్వేరు అయినా మనమంతా భారతీయులమే అన్నారు. ప్రతి ఒక్కరు దేశభక్తి, మానవత్వ విలువలను పాటించాలన్నారు. ఇలాంటి దాడులకు పాల్పడే వారికి దేశంలో స్థానం ఉండదన్నారు. ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ కల్నల్ డా. కమలాకర్ మాట్లాడుతూ, ''దేశ రక్షణ వ్యవస్థ మరింత బలపడాలంటే, సైనికులకు ప్రత్యేక అధికారాలు కల్పించాలి. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించి పారేయాలన్నారు. డా. ఛాయాదేవి మాట్లాడుతూ ఉగ్రవాదం దేశ శాంతి భద్రతలకు ప్రమాదకరమని, ఇది సామాజిక సంఘటనా వ్యవస్థను దెబ్బతీస్తోందన్నారు. కుముదిని దేవి కాలేజ్ సీఈఓ డా. యోబు మాట్లాడుతూ ఏ మతం అయినా హింసను ప్రోత్సహించకూడదు. మానవత్వం అన్నదే మతంగా అభివృద్ధి చెందాలని సూచించారు. సీనియర్ సభ్యురాలు శిరీష అంబల్ల మాట్లాడుతూ మతాలు వేర్వేరు అయినా మనుషులంతా ఒక్కటే. దేశాన్ని విభజించే విధంగా ఎవ్వరూ ప్రవర్తించకూడదన్నారు. 75 అడుగుల జాతీయ జెండాను చేతబట్టి ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు ర్యాలీ చేపట్టి ఉగ్రవాదాన్ని ఖండించారు. అనంతరం ఉగ్రదాడిలో మరణించిన అమాయకుల ఫోటోల ఎదుట కొవ్వొత్తులు వెలిగించి మౌన ప్రార్థన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, నర్సులు, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు

# నిరుపేద వికలాంగురాలికి ఆర్టిఫిషల్ కాలు అందజేత

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : పుట్టుకతో వికలాంగురాలైన ఓ గృహిణి భర్త చనిపోతే ఇద్దరు పిల్లలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న భారత్ వికాస్ పరిషత్ వికలాంగుల పునర్వసు కేంద్రా ట్రస్ట్ సేవా సంస్థ తన వంతు సహాయం చేయడానికి ముదుకు వచ్చింది. సోమవారం విశాఖపట్నంకు చెందిన కె నాగమణికి పుట్టుకతో ఒక కాలు చిన్నగా ఉండడంతో వికలాంగురాలిగా ఇబ్బంది పడకుండా ఆర్టిఫిషల్ కాలును తయారు చేయించిన భారత్ వికాస్ పరిషత్ వికలాంగుల పునర్వసు కేంద్రా ట్రస్ట్ సేవా సంస్థ




బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ భర్త చనిపోతే ఇద్దరు పిల్లలతో వికలాంగురాలు ఇబ్బంది పడుతుందని తమ దృష్టికి రావడంతో తమ వంతు సహాయం చేయడానికి ఆర్టిఫిషల్ కాలును తయారు చేయించి బాధితురాలికి అందిస్తున్నామన్నారు. నిరుపేద కుటుంబంలో కొట్టుమిట్టాడుతున్న బాధితురాలికి ఆర్థిక సహాయం చేయడానికి ఎవరైనా ముందుకు రావాలని, ఇద్దరు పిల్లల చదువు విషయంలో కూడా దాతలు ముందుకు వస్తే సహాయం చేసిన వారవుతారన్నారు. వికలాంగురాలు నాగమణి మాట్లాడుతూ తనకు ఆర్టిఫిషల్ కాలును అందజేసిన భారత్ వికాస్ పరిషత్ వికలాంగుల పునర్వసు కేంద్రా ట్రస్ట్ సేవా సంస్థ నిర్వాహకులు అమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన పిల్లల చదువు నిమిత్తం ఎవరైనా దాతలు సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తన భర్త చనిపోవడంతో ఇద్దరు పిల్లలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నరేందర్, మధు,స్వామి,రఘు,కిరణ్ గుత్తికొండ, మెరుగు శివక్రిష్ణ, నాగరాజు, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## హయత్ నగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బండి నరేష్ కు ఘన సన్మానం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: హయత్ నగర్ కోర్ట్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా బండి నరేష్ ఎన్నికయ్యారు. నూతన బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బండి నరేష్ ను మాజీ యాదాద్రి భువనగిరి జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జువ్వి నర్సింహ్మా మంగళవారం పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హత లేని వ్యక్తులు నడుపుతున్న ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు, క్లినిక్సను సీజ్ చేయాలి

*** మల్కాజ్గిరి డివిజన్ ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. శోభ రాణి**




మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : అర్హత లేని వ్యక్తులు నడుపుతున్న ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు, క్లినిక్సను సీజ్ చేయాలని మల్కాజ్గిరి డివిజన్ ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. శోభ రాణి అదేశించారు. ఇటీవలే తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సూచనల మేరకు అనధికార వైద్యులపై రాష్ట్రవ్యాప్తంగా చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈక్రమంలో, మెడికల్ కౌన్సిల్ గైడ్లైన్స్ ప్రకారం నిబంధనల విరుద్ధంగా ఎలాంటి మెడికల్ అర్హతలూ లేకుండా అలోపాథిక్ వైద్యం నిర్వహిస్తున్న వ్యక్తులపై సంబంధిత పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్ లు నమోదు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని రక్షించేందుకు ఇలాంటి దాడులు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, మల్కాజ్గిరి ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న శ్రీసాయి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ , షాదన్ క్లినిక్లను అధికారుల బృందం మంగళవారం సీజ్ చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టి అక్రమంగా వైద్యం నిర్వహిస్తున్న ఈ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.ఈ తనిఖీల్లో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్ ఉప జిల్లా ప్రోగ్రామ్ అధికారి డా. వినోద్, డిపిఎంఓ జోసెఫ్, సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ కు ఘన సన్మానం



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : వరంగల్ లో జరిగిన బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేసినందుకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రజల తరపున బిఆర్ఎస్ పార్టీ విప్ , కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గ యువజన విభాగం అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, జిహెచ్ఎంసి డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, సీనియర్ నాయకులు మక్సూద్ లు పాల్గొని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

## రాష్ట్రాన్ని దేశంలోనే నెం.1 రాష్ట్రంగా

# తీర్చిదిద్దిన ఘనత గులాబీ జెండాకు ఉంది

*** బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెం.1 రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత గులాబీ జెండాకు ఉందని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. మంగళవారం నగరంలోని తెలంగాణ భవన్ లో రజతోత్సవ వేడుకల విజయవంతంపై కాంగ్రెస్ నాయకుల పిచ్చి ప్రేలాపనలపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల సభ విజయవంతంతో కెసిఆర్ నాయకత్వంలోనే తెలంగాణ రాష్ట్రం బాగుపడుతుందని, ప్రజలు నమ్మినట్లు మరో మారు స్పష్టమైన సంకేతాలు వెళ్ళాయని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు.బిఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతంతో కాంగ్రెస్ నాయకుల వెన్నులో వణుకుపుట్టిందన్నారు. తెలంగాణ ప్రజల పక్షాన పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, , బిఆర్ఎస్ పార్టీ అధినాయకులు కెసిఆర్ కి, కేసీఆర్ ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందన్నారు.తెలంగాణ ప్రజల బాధలను, కష్టాలను తన వాణి ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తే కెసిఆర్ కి స్పష్టత లేదు అని సీఎం, మంత్రులు అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కెసిఆర్ ఉపన్యాసాన్ని వివిధ మాధ్యమాల ద్వారా కోటిన్నర మంది ప్రజలు వీక్షించారంటే, వారిపై ప్రజలకు ఉన్న విశ్వసనీయత, క్రేజ్, కెసిఆర్ ఇమేజ్ ఏ స్థాయిలో ఉందనేది స్పష్టమవుతుందన్నారు. కెసిఆర్ కి సరితూగే నాయకుడు తెలంగాణలోనే లేరన్నారు. రజతోత్సవ సభ విజయవంతంపై కాంగ్రెస్ నాయకుల మాటలు చూస్తుంటే మీరు పర్వతం ముందు పిచ్చికుక్కలు మొరిగినట్టు ఉందని, మీరు ఎన్ని మాటలు మాట్లాడిన పేరు పర్వతం విలువ తగ్గదు. శునకాలు, శునకాలుగానే ఉంటాయన్నారు. కెసిఆర్ ప్రజలు అనుకుంటున్న విషయాలనే చాలా క్లారిటీగా వివరించడం జరిగింది. వారి ప్రశ్నలకు, మాటలకు సమాధానం చెప్పలేక ఈ విధంగా మొరుగుతున్నారన్నారు. కెసిఆర్ కి స్పష్టత లేదు అని సీఎం రేవంత్ రెడ్డికి నక్సల్స్ సమస్య పరిష్కారంలో జరిగిన సమావేశంలో ఏమేమి తీర్మానాలు చేశారో అసలు కనీస అవగాహన లేదన్నారు. ఆపరేషన్ కగార్" అప్రజాస్వామికం వారితో శాంతి చర్చలు జరగాలని కెసిఆర్ చెప్పిన తర్వాతనే సీఎం రేవంత్ రెడ్డి జానారెడ్డి, కేశవరావు లను పిలిపించుకొని సూచనలు తీసుకుంటామనడం పై వారి అవగాహన, బాధ్యత స్పష్టమైందన్నారు. నక్సల్స్ సమస్యలు తెలిసిన మంత్రి సీతక్క నక్సల్స్ సమస్యపై మాట్లాడతారు అని అనుకున్నాం. కానీ ఎవరి మెప్పు కోసమో ఆమె కూడా సమస్య పరిష్కారానికి కృషి చేసినట్లుగా కనిపించట్లేదన్నారు. ఏమి మాట్లాడాలో అర్థం కాక పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఏమి చేశారని అడిగే మీరు అసలు సంవత్సన్నర కాలంలో మీ వాగ్దానాలను ఎంత వరకు పూర్తి చేశారో ప్రజలకు తెలియజేయాలన్నారు. ఏమి చేశారు, ఏమి చేశారు అని అనే మీరు సమీక్షలు నిర్వహించే పోలీస్ కమాండ్ కంట్రోల్, సెక్రటేరియట్, మీ ఊహల నగరమైన 4వ సిటీకి స్థలాన్ని సేకరించింది కేసీఆర్. కెసిఆర్ ఏం



చేశారంగంలో సీఎం కే మినిమం కామన్ సెన్స్ లేదన్నారు. అందాల పోటీలపై ముఖ్యమంత్రికి సమీక్షించే సమయం ఉంటుంది కానీ రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల సమస్యలు, నిరుద్యోగుల సమస్యలు, ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల బాధలు, సాగునీరు, నీటి సరఫరా పై సమీక్షించేందుకు సమయం ఉండదన్నారు. హైదరాబాద్ నగరంలో నీటి సరఫరా లేదు, స్ట్రీట్ లైట్స్ వెలగడం లేదు. ఆఫీస్ లీస్ స్పేస్ రంగంలో దేశంలోనే హైదరాబాద్ 7వ స్థానానికి పడిపోయిందన్నారు. ఇంటి గృహాల అమ్మకాలలో 49 శాతానికి పడిపోయింది. దీనికి కారణం నీ అసమర్ధ పాలన, చేతగానితనం కాదా...? ప్రభుత్వం ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిందన్నారు. తెలంగాణ పెన్షనర్స్ & రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్ బండ్లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేస్తున్న కనీసం పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు. గతంలో హైదరాబాద్ నగరంలో రెండు లక్షల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించి అందులో 1.60 1.70 లక్షల ఇళ్లను పంపిణీ చేశాం. వారికి కనీస వసతులు కల్పించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో లేనివారికి నోటీసులు ఇస్తున్నారు. ఖాళీగా ఉన్న ఇండ్లకు మళ్లీ రంగులు వేసి ఇందిరమ్మ ఇళ్ల పేరిట తిరిగి పంపిణీ చేయాలని చూస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్లపై తట్టాడు మట్టి తీయలేదు, పనులు ప్రారంభం కాలేదు. మేము కట్టించి ఇచ్చిన ఇళ్లకు మాత్రం నోటీసులు ఇస్తున్నారు. వెంటనే ప్రభుత్వం నోటీసులు ఇవ్వడం బంద్ చేసి మౌలిక వసతులు కల్పించాలన్నారు. అందాల పోటీలపై కాదు... ప్రజా సమస్యలపై సమీక్షలు నిర్వహిస్తే ప్రజలు ఇబ్బంది పడకుండా, బాగుపడతారన్నారు. చివరి ఆరు నెలలు ప్రభుత్వ పనితీరుకు రెఫరెన్స్ అంటున్న సీఎం అంటే ఈ నాలుగున్నర ఏళ్ళు పనిచేయమని చెప్పకనే చెబుతున్నారన్నారు. అప్పటివరకు దోచుకుంటాం, రాసుకుంటాం, త్వరలో పంచుకుంటాం, తిరిగి అధికారంలోకి వస్తాం అనే ఆశల పల్లకిలో సీఎం వ్యవహరిస్తున్నారు అనే విధంగా ఉందన్నారు. హైదరాబాద్ నగరంలో, గ్రామాలలో నేటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రజా సమస్యలపై సమీక్షల నిర్వహించకుండా అందాల పోటీలపై కమిషన్ నిర్వహించడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. మొదలు ప్రజా సమస్యలపై సమీక్షలు నిర్వహించండి. ఆ తర్వాత మీరు అందాల పోటీలపై సమీక్షల నిర్వహించుకుంటారో, లేక మీ పార్టీ నాయకులే పోటీలో పాల్గొంటారో నీ ఇష్టమన్నారు. 2014 కి ముందు పరిస్థితులు మళ్లీ వచ్చాయని, ప్రజా సమస్యలపై సమీక్షలు నిర్వహించకుండా చేతులు దులుపుకుంటున్నారని, బాధ్యతాగల ప్రతిపక్ష పార్టీగా ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు.

## విద్యార్థినులపైకి దూసుకెళ్లిన

# బొలేరో వాహనం.. ఇద్దరి మృతి

గద్వాల: గద్వాలలో బొలేరో వాహనం బీభత్సం సృష్టించింది. రోడ్డు పక్కన బస్టాప్లో నిలబడి ఉన్న నర్సింగ్ విద్యార్థినుల పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థినులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం సాయంత్రం కొందరు నర్సింగ్ విద్యార్థినులు కాలేజీ ముగిసిన తర్వాత హాస్టల్కు వెళ్లేందుకు బస్టాప్లో నిలబడి ఉండగా.. వారిపైకి వాహనం దూసుకెళ్లడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనతో అక్కడున్నవారంతా కేకలు వేయడంతో భీతావహ వాతావరణం నెలకొంది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. గద్వాల జిల్లా కేంద్రంలో పాత ఎస్పీ ఆఫీసులో ఏర్పాటుచేసిన నర్సింగ్ కాలేజీకి చెందిన విద్యార్థినులు తమ హాస్టల్కు వెళ్లేందుకు కొత్త హౌసింగ్ బోర్డ్ టర్నింగ్ బస్టాప్ వద్ద వేచి ఉండగా బొలేరో వాహనం



ఒక్కసారిగా దూసుకొచ్చింది. దీంతో ఇద్దరు విద్యార్థినులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు విద్యార్థినులు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అలాగే, ఈ బస్టాప్ వద్ద బస్సు/ఆటో కోసం ఎదురుచూస్తోన్న మరో ఇద్దరు చిన్నారులకు సైతం తీవ్ర గాయాలు కాగా.. ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్థానికులు వెల్లడించిన సమాచారం ప్రకారం.. బొలెరో వాహనం డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన జరిగిన వెంటనే అతడు పరారయ్యాడు. ఈ ఘటన గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ టి. శ్రీనివాసరావు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన నర్సింగ్ విద్యార్థినులు మక్తల్కు చెందిన మహేశ్వరి, వనపర్తికి చెందిన మనీషా శ్రీగా గుర్తించారు.

*** మంత్రి దామోదర రాజనర్సింహా తీవ్ర దిగ్భ్రాంతి**

ఈ ప్రమాద ఘటనపై మంత్రి దామోదర రాజనరసింహా విచారం వ్యక్తం చేశారు. ఇద్దరు నర్సింగ్ విద్యార్థినుల మృతి పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే, కలెక్టర్కు ఫోన్ చేసి మాట్లాడారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని మంత్రి ఆదేశించారు. దీంతో ఈ ప్రమాదంలో గాయపడిన విద్యార్థినులకు వైద్య సాయం అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

## భానుడి భగభగ.. జగిత్యాలలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



హైదరాబాద్: తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. పగటి పూట ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. మంగళవారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలో అత్యధికంగా 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిర్మల్ జిల్లా దస్తురాబాద్లో 44.3 డిగ్రీలు, నిజామాబాద్ జిల్లా మెందోరాలో 44.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

## భూభారతి చట్టం దేశానికి రోల్ మోడల్గా నిలుస్తుంది : మంత్రి పొంగులేటి

షట్పల్లి: చట్టం పేద ప్రజలకు చుట్టంలా ఉండాలనే భూభారతి చట్టం రూపొందించామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా షట్పల్లిలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోన్న మంచి పనులు చూడలేక మాజీ సీఎం కేసీఆర్కు దుఃఖం వస్తోందన్నారు. ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి చట్టం దేశానికి రోల్ మోడల్గా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## మేడిగడ్డలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్ఏ నివేదికలో ఎక్కడా లేదు

**: హరీశ్రావు**

హైదరాబాద్: కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదిక మీద నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ మాట్లాడినవన్నీ అబద్ధాలేనని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్రావు ఆరోపించారు. మేడిగడ్డలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్ఏ ఎక్కడా చెప్పలేదన్నారు. రాష్ట్రమంతటా బీఆర్ఎస్ రజతోత్సవ సభ, కేసీఆర్ ప్రసంగంపై చర్చ జరుగుతోందనే అక్కసుతో ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్డీఎస్ఏ ఎన్డీయే ప్రభుత్వ జేబు సంస్థగామారిందని హరీశ్రావు ఆక్షేపించారు. కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదికపై మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్పై హరీశ్రావు స్పందించారు. ఈ సందర్భంగా పలువురు నేతలతో కలిసి ఆయన తెలంగాణ భవన్లో మీడియాతో మాట్లాడారు. "జాతీయ డ్యామ్ సేఫ్టీ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతలకు డీపీఆర్ ఉందా? డీపీఆర్ లేకుండానే కొడంగల్ ఎత్తిపోతల పనులు ప్రారంభించారు. పోలవరంలో డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోతే ఎన్డీఎస్ఏ ఎందుకు మాట్లాడలేదు? పోలవరానికి ఎందుకు పోలేదు? ఎందుకు నివేదిక ఇవ్వలేదు? ఎన్డీఎస్ఏ అనేది ఎన్డీయే ప్రభుత్వ జేబు సంస్థగా మారింది.

# భారత సైనిక పత్రాలు లీకయ్యాయంటూ.. పాక్ అనుకూల 'ఫేక్' పోస్టులు

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ పాకిస్థాన్‌ల నడుమ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇదే అదనుగా భారత్‌కు వ్యతిరేకంగా కొంతమంది తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారు. తాజాగా భారత సైన్యం సన్నద్ధతకు సంబంధించిన రహస్య పత్రాలు లీకయ్యాయంటూ పాక్ అనుకూల సామాజిక మాధ్యమ ఖాతాల్లో పోస్టులు వస్తున్నాయి. ఈ వ్యవహారంపై కేంద్రం స్పందిస్తూ.. వాటిని నకిలీ పత్రాలుగా కొట్టిపారేసింది. ''భారత సైన్యం సంసిద్ధతకు సంబంధించిన రహస్య పత్రాలు లీకయ్యాయంటూ కొన్ని పాకిస్థాన్ అనుకూల సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టులు కనిపిస్తున్నాయి. అయితే, అవి తప్పుడు విషయాన్ని పేర్కొంటున్నాయి. సంబంధిత పత్రాలు నకిలీవి. అధికారికంగా ధ్రువీకరించని వివరాలను ఎవరూ షేర్ చేయొద్దు. కచ్చితమైన సమాచారం కోసం కేంద్ర ప్రభుత్వ అధికారిక ప్రకటనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోండి'' అని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం 'ఎక్స్' వేదికగా పోస్ట్ పెట్టింది. అంతకుముందు..




సైన్యం ఆధునికీకరణ కోసం విరాళాలు సేకరిస్తున్నారని, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ బ్యాంకు ఖాతా తెరిచిందంటూ చక్కర్లు కొడుతున్న ఓ సందేశాన్నీ కేంద్రం కొట్టిపారేసింది. వాట్సప్‌లో తప్పుడు ప్రచారం జరుగుతోందని రక్షణశాఖ స్పష్టం చేసింది. బ్యాంకు ఖాతాను తెరిచిందన్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని పేర్కొంది. అటువంటి తప్పుడు ప్రచారాలతో మోసపోవద్దని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం హెచ్చరించింది.



# ప్రధాని మోదీతో RSS చీఫ్ మోహన్ భాగవత్ భేటీ

ప్రధాని నరేంద్ర మోదీతో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అధినేత మోహన్ భాగవత్ భేటీ అయ్యారు. దిల్లీలోని 7 లోక్ కల్యాణ్ మార్గ్‌లో ప్రధాని నివాసానికి చేరుకున్న ఆయన.. మోదీతో సమావేశమయ్యారు. రక్షణ మంత్రి, త్రివిధ దళాల అధిపతులతో ప్రధాని సమావేశం ముగిసిన వెంటనే ఆర్ఎస్ఎస్ చీఫ్ ప్రధాని మోదీని కలిశారు. పహల్గాం ఉగ్రదాడితో సరిహద్దులో భారత్‌పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ వీరి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. పహల్గాంలో మారణహోమానికి పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరించాలని, దీటైన జవాబు ఇవ్వాలని మోహన్ భాగవత్ ఇటీవల పేర్కొన్నారు. ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. భారత్ ఎప్పుడూ పొరుగు వారికి అపాయం చేయదు.. కానీ, ఎవరైనా శత్రువులుగా మారితే మాత్రం వారిని వదిలిపెట్టదన్నారు. దీటైన జవాబు ఉంటుందని ఆశిస్తున్నామని.. మతం గురించి తెలుసుకొని ప్రాణాలు తీయడం మరీ దారుణమన్నారు. ఆ ఘటనతో తమ హృదయాలు బరువెక్కాయని.. ప్రజలు చాలా ఆగ్రహంతో ఉన్నామని ఆర్ఎస్ఎస్ చీఫ్ పేర్కొన్నారు.



# ఆ పాక్ జాతీయుల్లో శౌర్య చక్ర గ్రహీత తల్లి..

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ వలసదారులు, జాతీయులు భారత్‌ను విడిచి వెళ్లాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. జమ్మూకశ్మీర్ నుంచి 60 మంది పాకిస్థానీయులను స్వదేశానికి తిప్పిపంపేందుకు అధికార యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. ఆ జాబితాలో శౌర్యచక్ర గ్రహీత తల్లికూడా ఉన్నారని అధికారులు తెలిపారు జమ్మూకశ్మీర్‌లో వివిధ ప్రాంతాల్లో ఉంటున్న 60 మంది పాక్ జాతీయులను ప్రభుత్వం గుర్తించింది. వారిని వాఘా సరిహద్దులో పాక్ అధికారులకు అప్పగించనున్నారు. జమ్మూకశ్మీర్‌లో 2010 పునరావాసం విధానం కింద కశ్మీర్ వచ్చిన మాజీ ఉగ్రవాదుల భార్యలు (వీరు పాకిస్థాన్‌కు చెందినవారు) ఉన్నారు. ఇక ఈ 60 మందిలో కానిస్టేబుల్ ముదాసిర్ అహ్మద్ షేక్ తల్లి షమీమా అక్తర్ కూడా ఉన్నారు. 2022లో ఉగ్రవాదులతో పోరాడుతూ అహ్మద్ ప్రాణాలు కోల్పోయారు. ఆయన జమ్మూకశ్మీర్ పోలీసు విభాగం నిర్వహించే అండర్ కవర్ ఆపరేషన్‌లో సభ్యుడిగా ఉండేవారు. అయితే ఆయన మరణానంతరం కేంద్ర ప్రభుత్వం శౌర్యచక్ర పురస్కారాన్ని ప్రకటించింది. దానిని 2023లో షమీమా, ఆమె భర్త కలిసి రాష్ట్రపతి నుంచి స్వీకరించారు. ''షమీమాది పాక్ ఆక్రమిత కశ్మీర్. అది మన భూభాగం. ఆమె అక్కడి నుంచి 20 ఏళ్ల వయసులో ఇక్కడకు వచ్చింది. 45 ఏళ్లుగా ఇక్కడే నివసిస్తోంది. పాకిస్థానీలను మాత్రమే బహిష్కరించాలని మోదీ, అమిత్‌షాను కోరుతున్నాను'' అని ముదాసిర్ అంకుల్ బంధువు మీడియా ఎదుట అభ్యర్థించారు. గతంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లెఫ్టినెంట్ గవర్నర్.. ముదాసిర్ ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు కూడా. 1990ల్లో మహమ్మద్ మక్సూద్‌ను షమీమా వివాహం చేసుకున్నారు. మక్సూద్ విశ్రాంత పోలీసు అధికారి. ముదాసిర్ జ్ఞాపకార్థం బారాముల్లాలోని ప్రధాన పట్టణ కూడలికి షహీద్ ముదాసిర్ చౌక్ అని పేరు కూడా పెట్టారు. ఇదిలా ఉంటే.. జమ్మూకశ్మీర్‌లో 2010 పునరావాసం విధానం కింద కశ్మీర్ వచ్చిన మాజీ ఉగ్రవాదుల పాకిస్థానీ భార్యలు భారత్‌ను విడిచి వెళ్లడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పాకిస్థాన్ వెళ్లడం కంటే తమను చంపేసి సంచుల్లో మృతదేహాలను పాకిస్థాన్‌కు పంపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

# కాంగ్రెస్, భాజపా మధ్య 'ఫొటో' వార్!

కేంద్రంలో అధికార భాజపా, విపక్ష కాంగ్రెస్ పార్టీ మధ్య మాటల యుద్ధం నెలకొంది. పహల్గాం ఉగ్రదాడి ఘటనపై నిర్వహించిన కీలక సమావేశానికి ప్రధాని మోదీ గైర్హాజరును తప్పుబడుతూ.. సామాజిక మాధ్యమాల్లో ఓ ఫొటోను ఉంచింది. దీన్ని ఖండించిన భాజపా.. కాంగ్రెస్ వ్యవహారశైలిని తూర్పారపట్టింది. రాహుల్ గాంధీ పోలికలతో కూడిన ఓ ఫొటోతో బదులిచ్చింది. అసలేం జరిగింది అంటే? పహల్గాం దాడి ఘటనపై తొలుత అత్యున్నత సమావేశం నిర్వహించిన కేంద్రం.. మరుసటి రోజు అఖిలపక్ష సమావేశం జరిపింది. ఈ సమావేశానికి ప్రధాని మోదీ దూరంగా ఉన్నారు. అదే రోజు బిహార్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. దీన్ని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తప్పుబట్టారు. ఇదే అంశంపై సోమవారం ఆ పార్టీ తన అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో ఓ ఫొటోను ఉంచింది. 'బాధ్యతగా వ్యవహరించాల్సిన




సమయంలో గాయబ్' అనే క్యాప్షన్‌తో ఓ ఫొటోను ఉంచింది. నేరుగా ప్రధాని మోదీ పేరును గానీ, ఫొటోను గానీ ప్రస్తావించనప్పటికీ.. దుస్తులు, ఆహార్యం మోదీని పోలి ఉండడంతో భాజపా ప్రతి విమర్శలకు దిగింది. కాంగ్రెస్ పార్టీ పాకిస్థాన్‌తో చేతులు కలిపి ఆ భాష మాట్లాడుతోందని భాజపా ఐటీ సెల్ ఇన్‌ఛార్జి అమిత్ మాలవీయ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. ముస్లిం ఓటు బ్యాంకు కోసం ప్రధానిని ఆ పార్టీ లక్ష్యంగా చేసుకుందని విమర్శించారు. ఆ పార్టీ కూడా రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుంది. ఆ పార్టీ అధికార ప్రతినిధి ఆర్‌పీ సింగ్.. 'పాకిస్థాన్ స్నేహితుడు' అనే ట్యాగ్‌లైన్‌తో ఓ ఫొటోను పోస్ట్ చేశారు. రాహుల్ గాంధీ పేరును ఎక్కడా ప్రస్తావించనప్పటికీ.. తెలుపు రంగు టీషర్ట్, క్యాప్ ధరించిన ఓ వ్యక్తి చేతిలో కత్తి పట్టుకున్న ఫొటోను తన ఎక్స్ ఖాతాలో ఉంచారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ బుధవారం మరోసారి సమావేశం కానుంది.

# ఎన్నికల్లో కార్నీ విజయం..
## భారత్, కెనడా మధ్య విభేదాలు తొలగనున్నాయా!

కెనడా ఎన్నికల్లో లిబరల్స్ పార్టీ భారీ ఆధిక్యంతో విజయం సాధించింది. దీంతో నూతన ప్రధానిగా మార్క్ కార్నీ మరోసారి బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ కార్నీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంతో కాలంగా భారత్, కెనడా ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలు, చట్టపరమైన పాలన పట్ల దృఢమైన వైఖరి, నిబద్ధతను ప్రదర్శిస్తున్నాయని మోదీ అన్నారు. కెనడాతో భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడానకి, ప్రజలకు మరిన్ని అవకాశాలు కల్పించడానికి భవిష్యత్తులో ఆ దేశంతో కలిసి పని చేయడానికి ఉత్సాహంగా ఎదురు చూస్తున్నామని తెలిపారు. ఇటీవల కెనడాతో సహా పలు దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌లు విధించిన విషయం తెలిసిందే. దీంతో అగ్రదేశంతో కెనడాకు విభేదాలు నెలకొన్నాయి. అంతే కాకుండా ఆ దేశంలో ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో జస్టిన్ ట్రూడోకు సొంత పార్టీ నుంచే తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రధాని పదవితో పాటు, పార్టీ నాయకత్వానికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో నూతన ప్రధాన మంత్రిగా మార్క్ కార్నీ నియమితులయ్యారు. ట్రూడో



భారత్‌కు వ్యతిరేకంగా వెళ్లినప్పటికీ కార్నీ అధికారం చేపట్టినప్పటి నుంచి భారత్‌కు మద్దతుగానే ఉన్నారు. దీంతో కెనడా భారత్ మధ్య విచ్ఛిన్నమైన సంబంధాలు మెరుగయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. భారత్‌తో దౌత్య, వాణిజ్య సంబంధాలను పునరుద్ధరించుకోవడానికి ప్రయత్నాలు చేస్తామని అనేకసార్లు బహిరంగంగా ప్రకటించారు. భారత్‌తో సంబంధాలు తెగిపోవడానికి కారణమైన విభేదాలను పరిష్కరించడానికి కృషి చేస్తామని కార్నీ పేర్కొన్నారు. కెనడియన్లు వ్యక్తిగతంగా, ఆర్థికంగా, వ్యూహాత్మకంగా భారత్‌తో సంబంధాలు కలిగిఉంటారన్నారు. ప్రపంచ ఆర్థికవ్యవస్థ పునర్నిర్మితమవుతున్న సమయంలో భారత్, కెనడా వంటి దేశాలు భాగస్వామ్య ఆర్థికవ్యవస్థను నిర్మించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయని తాను నమ్ముతున్నానని తెలిపారు. తాము అధికారం చేపట్టగానే న్యూదిల్లీతోనే కాకుండా సారూప్యత కలిగిన దేశాలతోనూ వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. కెనడా, భారత్ మధ్య అధికారిక ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకుంటామన్నారు. దీంతో ఇరుదేశాల మధ్య దౌత్య, వాణిజ్య సంబంధాలు మెరుగవ్వనున్నాయి. ఆ దేశంలో చదువుకోవాలనుకునే భారత విద్యార్థులకు కూడా ఇవి ఉపయోగపడతాయి.

# భారత్‌లో పాక్ రక్షణ మంత్రి 'ఎక్స్' ఖాతా నిలిపివేత

పాకిస్థాన్ రక్షణమంత్రి ఖవాజా మహమ్మద్ అసిఫ్ ఎక్స్ ఖాతాను భారత ప్రభుత్వం నిలిపివేసింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత జమ్మూకశ్మీర్‌పై ఆ మంత్రి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారన్న కారణంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. చట్టపరమైన డిమాండ్‌కు ప్రతిస్పందనగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆ ఖాతాను ఓపెన్ చేసిన వారికి ఒక సందేశం దర్శనమిస్తోంది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం పలు కీలక చర్యలు చేపడుతోంది.




పాకిస్థాన్ కేంద్రంగా నిర్వహిస్తున్న పలు యూట్యూబ్ ఛానళ్ల ప్రసారాలను భారత్‌లో నిషేధించిన సంగతి తెలిసిందే. పాక్ న్యూస్, ఎంటర్‌టైన్‌మెంట్ మీడియాకు చెందిన 16 ఛానళ్లపై ఈ వేటు వేసింది. ఈ క్రమంలోనే రక్షణ మంత్రి ఖాతాను బ్లాక్ చేసింది. పహల్గాం దాడి తర్వాత పాక్ రక్షణమంత్రి పలుమార్లు మీడియాతో మాట్లాడారు. ఉగ్రవాదులను పెంచి పోషించడంపై మీ స్పందన ఏంటి? అని మీడియా అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ.. ''అమెరికా, బ్రిటన్ సహా పశ్చిమదేశాల కోసమే మూడు దశాబ్దాల పాటు మేం ఈ చెత్త పనులన్నీ చేస్తున్నాం. అయితే అది పొరబాటు అని అర్థమైంది. దానివల్ల పాక్ చాలా ఇబ్బందులు పడింది. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో మేం చేరకపోయి ఉంటే.. పాక్‌కు తిరుగులేని ట్రాక్ రికార్డ్ ఉండేది'' అని అన్నారు.

# పూల ప్రింటు... ఇప్పుడిదే ట్రెండు!

**మల్లెపూల అందం చీరకొంగుపైకి చేరితే, గులాబీల సొగసు ఫ్రాక్‌మీద కనిపిస్తే, సన్నజాజుల సౌందర్యం లెహెంగాకి జత అయితే... బంతిపూల సోయగం చొక్కాని మెరిపిస్తే... 'ఫ్యాషన్లో దాగున్న పూలెంతో అతిశయం' అనకుండా ఉండగలరా! ఎన్నెన్ని ఫ్యాషన్లు పుట్టుకొచ్చినా ఈ పూల ప్రింట్ల డిజైన్లనే ఎంచుకోరా! అది తెలిసే, ఈతరమూ మెచ్చేలా వచ్చేశాయి సరికొత్త ఫ్లోరల్ ప్రింట్ ట్రెండ్స్. వాటిపైన మీరూ ఓ లుక్కేయండి మరి!**







'సిరిమల్లె పువ్వా, సిరిమల్లె పువ్వా' అంటూ అప్పట్లో పదహారేళ్ల పడుచులు పాటలు పాడుకున్నా... 'జాజి మల్లీ తోటలోనా ఊసులాడే గోరువంకా' అని నేటి అమ్మాయిలు పూల రాగాలు తీసినా అందుకు కారణం అతివలకు పువ్వుల మీద ఉన్న అమితమైన ప్రేమే!







చూడగానే కనువిందుచేసే తీరైన పూరేకుల అమరికనే! ఆ ప్రత్యేకతలతోనే నెమ్మదిగా ఫ్యాషన్ రంగంలోకి అడుగు పెట్టాయి ఫ్లోరల్ ప్రింట్లు. అంతేనా జర్దోసి అందాలు... అద్దాల చమక్కులు... చమ్కీల మెరుపులు... అల్లికల వయ్యారాలు... ఇవేవీ లేకపోయినా దుస్తుల సొగసు పెంచాలంటే కచ్చితంగా ఆ క్రెడిట్ పూల ప్రింట్లకే చెల్లుతుందని చెప్పాలి. ఇదిగో, ఆ గొప్పతనమే ఫ్యాషన్ ప్రపంచంలో దీన్ని ఎవర్‌గ్రీన్‌గా నిలిపింది కూడా. డ్రెస్సుకు అందాన్నీ, మనసుకు ఆహ్లాదాన్నీ అందించే ఈ ఫ్లోరల్ బ్యూటీ అక్కడితో ఆగిపోలేదు. దుస్తుల దగ్గర్నుంచి అన్నిరకాల యాక్సెసరీస్‌లోకీ చేరిపోయింది. ముఖ్యంగా మండు వేసవిలో కంటికీ, ఒంటికీ హాయిగొలిపే ఆ పువ్వుల సౌందర్యం సమ్మర్ ఫ్యాషన్లలో మొదటి స్థానం తెచ్చుకుని అందర్నీ ఆకట్టుకుంటోంది.

### అన్నింటా పూల సోయగమే...

లేత చిగుళ్లు, హరివిల్లు వర్ణాల పువ్వులు... ప్రకృతికి రంగులు అద్దుతూ ఈ వేసవి రుతువుల్ని ఆనందమయం చేస్తాయి. ఆ సంతోషాన్ని ఫ్యాషన్లలోకి తీసుకొస్తే ఎంత బాగుంటుందో అనుకున్న డిజైనర్లు ఫ్లోరల్ ప్రింట్ల దుస్తుల్ని డిజైను చేశారు. అలసిన కళ్లని సేదతీర్చే పూల సొగసులతో ఈ చల్లచల్లటి ట్రెండ్‌ని సృష్టించేశారు. అలా మొదట్లో తెలుపు, లేలేత రంగుల మీద ముదురు వన్నెల పువ్వుల ప్రింట్లతో కొన్ని రకాల దుస్తుల్ని మాత్రమే తయారుచేసేవాళ్లు. కానీ ఇప్పుడు అలా కాదు. ఒకవైపు సంప్రదాయ దుస్తుల్లో, మరోవైపు ట్రెండీ డ్రెస్సుల్లో ఇదే సింగిల్



ఫ్యాషన్ అయిపోయింది. కాటన్, షిఫాన్, జార్జెట్, సిల్క్, నెట్, ఆర్గాంజా... ఇలా ఒకటేంటీ అన్నిరకాల ఫ్యాబ్రిక్కుల మీదకీ ఈ ఫ్లోరల్ ప్రింట్ల అందం వచ్చేసింది. డిజైనర్లు మరింతగా ఫ్యాషన్ ప్రియుల మనసు దోచడానికి పార్టీవేర్ చీరల్లోనూ ఈ ట్రెండ్‌ను తీసుకొస్తున్నారు. సాదా చీరకు సరిపోయేలా డిజైనర్ బ్లౌజుల్లోనూ ఈ పువ్వుల్ని చొప్పించారు. గులాబీలు, మల్లెలు, లిల్లీలు, ముద్దబంతులు, చామంతులు, మందారాలతోపాటు ముచ్చటైన ఆర్కిడ్ పువ్వుల సొగసుల్నీ... చూడచక్కని పూలతీగల్నీ ఈ ఫ్లోరల్ ప్రింట్లలో భాగం చేస్తున్నారు. ఆహ్లాదకరమైన అనుభూతినిచ్చే ఎన్నెన్నో డిజైన్లకు రూపమిస్తున్నారు. కొన్నేమో పైనుంచి కింద వరకూ చిట్టిచిట్టి పూల ప్రింట్లతో ఆకర్షిస్తే... మరికొన్ని పువ్వుల అంచులతో అద్భుతః అనిపిస్తున్నాయి. ఇంకొన్ని లేత రంగుల మధ్యలో చక్కటి ఫ్లవర్లతో అదిరిపోతున్నాయి. అక్కడక్కడ మాత్రమే కనిపించీకనిపించనట్టు వచ్చిన ఫ్లవర్ డిజైన్ల డ్రెస్సులూ ఉన్నాయి. పువ్వుల ప్రింట్లు అనగానే ఎక్కువగా లేత రంగుల్లోనే బాగుంటాయి అనుకుంటారు చాలామంది. కానీ ఈ మధ్య నలుపు, ఎరుపు, నీలం, ఆకుపచ్చ... తదితర ముదురు వర్ణాల దుస్తులపైనా ఈ ప్రింట్లు ఎంతో చక్కగా వస్తున్నాయి. పేస్టల్ రంగుల పువ్వులతో ఆ డార్క్ కలర్స్ హైలెట్ అయ్యేలా ఉంటాయివన్నీ కూడా.

లెహెంగా, చుడీదార్లతోపాటు పలాజో, టాప్, స్కర్ట్, జీన్స్‌ప్యాంట్, లెగ్గింగ్ తదితర లేటెస్ట్ ఫ్యాషన్ డ్రెస్సుల్లోనూ ఈ ఫ్లోరల్ ప్రింట్స్ అలరిస్తున్నాయి. ఇంకా చిన్నారుల డ్రెస్సులూ, మగవాళ్ల చొక్కాలూ కూడా ఈ అందాల డిజైన్లతో విరబూస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే రోజువారీ డ్రెస్సుల నుంచి పెళ్లిబట్టల వరకూ ఈ ఫ్లోరల్స్ మెరిసిపోతున్నాయంటే నమ్మండి.

ఇకపోతే, ఫ్యాషన్ అంటే ఒక్క దుస్తులే కాదుగా... అందుకే వాచీలు, టోపీలు, కళ్లజోళ్లు, ఫోన్ కవర్లు, హ్యాండ్‌బ్యాగులు, చెప్పులు... ఇలా యాక్సెసరీస్ అన్నీ కూడా ఫ్లోరల్ ప్రింట్లతో రెడీ అయిపోయాయి. అభిరుచికి తగ్గట్టు కోరుకున్న వెరైటీలతో మార్కెట్లో హల్‌చల్ చేస్తున్నాయి.

హుందాగానూ, అందరిలో ప్రత్యేకంగానూ ఉండాలనుకునేవాళ్లకు ఈ పూల ఫ్యాషన్... ఎంతో నచ్చేస్తుంది, సరిగ్గా నప్పేస్తుంది. పిల్లల నుంచి పెద్దల వరకూ అందరికీ తగ్గట్టుగా బోలెడు వెరైటీలు దొరుకుతున్నాయి. అయితే పూర్తిగా పువ్వుల డిజైన్లే కాకుండా సాదా రంగులకు జతగా వీటిని ఎంచుకుంటే మంచిది. మరి ఆలస్యం ఎందుకు... ఈసారి షాపింగ్‌కి వెళ్లినప్పుడు నెలకోసారి మారిపోయే ఫ్యాషన్‌ని కాస్త పక్కనపెట్టి, ఫ్లోరల్‌వేర్‌ని ప్రయత్నించి చూడండి. అటు ట్రెండ్‌ను ఫాలో అయినట్టూ ఉంటుందీ, ఇటు ఎప్పటికీ నిలిచిపోయే ఫ్యాషన్ దుస్తులూ మీ సొంతం అవుతాయి!



## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఫ్లాట్‌గా ముగిశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 80,396.92 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 80,122.02 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. గరిష్ఠంగా 80,661.31 పాయింట్ల వరకు పెరిగింది. చివరకు 70.02 పాయింట్లు పెరిగి.. 80,288.38 వద్ద ముగిసింది. నిఫ్టీ 7.45 పాయింట్లు పెరిగి 24,335.95 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 1766 షేర్లు లాభపడ్డాయి. మరో 2012 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో భారత్ ఎలక్ట్రానిక్స్, టెక్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎటర్నల్, ట్రెంట్ లాభాలను ఆర్జించాయి. సన్ ఫార్మా, ఓఎన్‌జీసీ, కోల్ ఇండియా, అల్ట్రాటెక్ సిమెంట్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ నష్టపోయాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. రంగాల వారీగా చూస్తే క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్ 0.5శాతం నుంచి ఒకశాతం దాకా పెరిగాయి. మెటల్, పవర్, టెలికాం, ఫార్మా 0.5శాతం నుంచి ఒకశాతం వరకు పతనయ్యాయి.

## భారీ ధర పలుకుతున్న బంగారం..!

### అక్షయ తృతీయ రోజున భారీ కొనుగోళ్లు జరిగేనా..?



**న్యూఢిల్లీ:** భారతీయులకు బంగారం ఎంటే ఎంతో మక్కువ. వివాహాలు, ఇతర శుభకార్యాల సమయంలో పెద్ద ఎత్తున బంగారం కొనుగోలు చేస్తుంటారు. ముఖ్యంగా అక్షయ తృతీయ రోజున పెద్ద ఎత్తున పసిడిని కొనుగోలు చేస్తుంటారు. అక్షయ తృతీయ రోజున బంగారం కొనుగోలు సెంటిమెంట్‌గా మారింది. ప్రస్తుతం, బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరాయి. గత కొద్దిరోజులుగా ధరలు గణనీయంగా తగ్గుతూ వచ్చాయి. వ్యాపారులు లాభాల స్వీకరణకు దిగడం, డాలర్‌కు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో బంగారం ధరల్లో హెచ్చుతగ్గులున్నాయి. అయినప్పటికీ అక్షయ తృతీయ రోజున భారతీయులు పెద్ద సంఖ్యలో బంగారం కొంటారని బులియన్ మార్కెట్ వ్యాపారులు అంచనా వేస్తున్నారు. కొనుగోలుదారులు అవసరానికి అనుగుణంగా ఆభరణాలు కొనుగోలు చేస్తున్నారని.. తేలికపాటి ఆభరణాల నుంచి గోల్డ్ ఈటీఎఫ్స్, డిజిటల్ గోల్డ్, బార్‌లతో సహా కాయిన్స్ వరకు వివిధ రకాలుగా బంగారాన్ని కొనుగోలు చేసేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. ఈ నెల 30న అక్షయ తృతీయ రోజున ధరలను పరిశీలిచి బంగారం కొనాలా? వద్దా? అనే నిర్ణయం తీసుకోవచ్చని ఆభరణాల వ్యాపారులు పేర్కొంటున్నారు.

#### ధరలు అధికంగా ఉన్నా బంగారంపై సెంటిమెంట్ బలంగానే..

పీఎన్‌జీ జ్యువెల్లర్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సౌరభ్ గాడ్గిల్ మాట్లాడుతూ.. బంగారం ధరలు రికార్డు స్థాయిలో ఉన్నప్పటికీ.. వినియోగదారుల సెంటిమెంట్ బలంగానే ఉందని పేర్కొన్నారు. అక్షయ తృతీయ రోజున బంగారం అమ్మకాలు పెరుగుతాయని తాము ఆశిస్తున్నామని తెలిపారు. అయితే, అధిక ధరలు గత సంవత్సరంతో పోలిస్తే వాల్యూమ్ వృద్ధిని తగ్గించవచ్చని.. విలువ పెరుగుదల కారణంగా ఇది భర్తీ చేయబడుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం అమ్మకాలపై ఎలాంటి ఒత్తిడిని కనిపించడం లేదని, దాంతో పాటు ముఖ్యంగా ప్రపంచ అనిశ్చితి దృష్ట్యా బంగారాన్ని సురక్షితమైన, నమ్మదగిన పెట్టుబడిగా చూస్తున్నారన్నారు. ఈ పండగ సీజన్‌లో బలమైన అమ్మకాలు జరుగుతాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం నాణేలు, బార్ బుకింగ్ చాలాకాలం కిందట జరిగిందని ఇండియన్ బులియన్ అండ్ జ్యువెలరీ అసోసియేషన్ జాతీయ ప్రతినిధి కుమార్ జైన్ చెప్పారు. కానీ, గత సంవత్సరం కంటే చాలా తక్కువ. అయినప్పటికీ, అక్షయ తృతీయ నాడు అమ్మకాలు ఉండవచ్చని ఆశిస్తున్నారు. జవేరి బజార్‌లోని బీడీ బ్యాంగిల్స్ శ్రేయాస్ కొఠారి మాట్లాడుతూ.. ఈ సందర్భంగా వినియోగదారులు షాపింగ్ చేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. అధిక బంగారం ధరల కారణంగా తేలికైన ఆభరణాల కొనుగోలు ఉంటుందని.. పాత ఆభరణాల స్థానంలో కొత్త ఆభరణాలతో మార్పిడి ఉంటుందని అంచనా. ఆభరణాల తయారీపై డిస్కౌంట్స్ అందిస్తున్నామని.. కొనుగోలుదారుల కోసం అనేక ఆఫర్లను తీసుకువస్తున్నట్లు తెలిపారు.

#### జనవరి నుంచి ప్రపంచ ధరలు 25 శాతం పెరిగాయి..

వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ఇండియా రీజనల్ సీఈవో సచిన్ జైన్ మాట్లాడుతూ.. ఈ ఏడాది బంగారానికి కీలకమైందని పేర్కొన్నారు. జనవరి నుంచి ప్రపంచ ధరలు 25శాతం పెరిగాయి. దేశీయ మార్కెట్‌లో కూడా బంగారం ధరలు పది గ్రాములకు రూ. లక్షకు చేరుకుంది. సురక్షితమైన పెట్టుబడి, మంచి రాబడి కారణంగా బంగారంలో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ.. ఈ అక్షయ తృతీయ రోజున కొనుగోళ్లు ఉంటాయని ఆయన చెప్పారు. బంగారం ఈటీఎఫ్స్, డిజిటల్ బంగారం, నాణేలు, గోల్డ్ బార్స్‌లు వివిధ రకాల బంగారంపై కొనుగోలుదారులు బలమైన ఆసక్తిని చూపిస్తున్నారని వర్గాలు తెలిపాయి. బంగారం ఆభరణాల రిటైర్లు తగినంత స్టాక్స్‌ని కలిగి ఉండగా.. పండుగలతో పాటు వివాహల సీజన్‌లో ప్రారంభమవుతున్నందున కొనుగోళ్లు ఆశాజనకంగా ఉండొచ్చని ఆశిస్తున్నారు.

## ఇండస్ ఇండ్ బ్యాంక్ డిప్యూటీ సీఈవో పదవికి అరుణ్ ఖురానా రాజీనామా..!




**న్యూఢిల్లీ:** ఇండస్ ఇండ్ బ్యాంక్ డిప్యూటీ సీఈవో అరుణ్ ఖురానా తన పదవీకి రాజీనామా చేశారు. ఇటీవల బ్యాంకు అకౌటింగ్‌లో అవకతవకలు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. బ్యాంక్ ట్రెజరీ ఫ్రంట్ ఆఫీస్ బాధ్యతలను చూసుకునేవారు. మార్చి 2025తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు రూ.1960కోట్ల నష్టాన్ని చవిచూసిన నేపథ్యంలో ఆయన పదవి నుంచి తప్పుకున్నారు. కంపెనీ ఖాతాలపై అంతర్గత డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకలను గుర్తించిన నేపథ్యంలో.. ఇటీవలి దురదృష్టకర పరిణామాల దృష్ట్యా, ట్రెజరీ ఫ్రంట్ ఆఫీస్ ఫంక్షనరీ, హోల్ టైమ్ డైరెక్టర్, డిప్యూటీ సీఈఓ, బ్యాంక్ సీనియర్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా తన పదవికి తక్షణమే రాజీనామా చేస్తున్నట్లు ఖురానా బ్యాంక్ బోర్డుకు పంపిన తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు.

సోమవారం సాయంత్రం స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో ఇండస్‌ఇండ్ బ్యాంక్.. ఖురానా రాజీనామా ఏప్రిల్ 28 నుంచి అమలులోకి వస్తుందని తెలిపింది. ఖురానా తన రాజీనామా లేఖలో తనపై విశ్వాసం ఉంచి.. బ్యాంకులో తనకు బాధ్యతలు అప్పగించినందుకు బోర్డుకు ధన్యవాదాలు తెలిపారు. బ్యాంకు భవిష్యత్ బాగుండాలని ఆకాంక్షించారు. ఏప్రిల్ 15న డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకల నేపథ్యంలో నికర విలువపై రూ.1,979 కోట్ల ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని ఇండస్‌ఇండ్ బ్యాంక్ మరొక ఇంటర్నల్ ఏజెన్సీ బేస్ నివేదికను వెల్లడించింది. ప్రైవేట్ రంగ రుణదాత గత నెలలో దాని డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియోలో అకౌంటింగ్ అవకతవకలు నివేదించింది. ఇది డిసెంబర్ 2024 నాటికి బ్యాంక్ నికర విలువపై దాదాపు 2.35 శాతం ప్రతికూల ప్రభావం చూపుతుందని అంచనా.

# కేకేఆర్ ప్లే ఆఫ్స్ ఆశలు సజీవం..

### పోరాడి ఓడిన ఢిల్లీ

### టేబుల్ టాపర్ ఆశలపై నీళ్లు చల్లిన కేకేఆర్




**ఢిల్లీ:** ఐపీఎల్ 2025 పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుందామని ఢిల్లీ క్యాపిటల్స్ పెట్టుకున్న ఆశలపై.. డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ నీళ్లు చల్లింది. మంగళవారం (ఏప్రిల్ 29) ఢిల్లీ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన కేకేఆర్.. ఢిల్లీ ముందు 205 పరుగుల లక్ష్యాన్ని నిలిపింది. అనంతరం ఢిల్లీ.. 190 రన్స్ వద్దే ఆగిపోయింది. దీంతో ఈ టోర్నీలో వరుసగా రెండో ఓటమిని చవిచూసింది.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కెప్టెన్ అక్షర్ పటేల్.. బౌలింగ్ ఎంచుకున్నాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ బ్యాటర్లంతా సమష్టిగా రాణించారు. ముఖ్యంగా రహ్మానుల్లా గుర్బాజ్ (12 బంతుల్లో 26 రన్స్), సునీల్ నరైన్ (16 బంతుల్లో 27 రన్స్), అజింక్య రహానే (14 బంతుల్లో 26 రన్స్), రఘువంశీ (32 బంతుల్లో 44 పరుగులు), రింకూ సింగ్ (25 బంతుల్లో 36 రన్స్) సత్తాచాటారు. దీంతో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 204 రన్స్ స్కోరు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 3, విప్రాజ్ నిగమ్ 2, అక్షర్ పటేల్ 2, దుశ్మంత చమీర 1 వికెట్ పడగొట్టారు.

అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా వికెట్లు కోల్పోయింది. అయితే ఫాఫ్ డుప్లెసిస్ (45 బంతుల్లో 62 రన్స్) అక్షర్ పటేల్ (23 బంతుల్లో43 రన్స్) పోరాడటంతో మళ్లీ పోటీలోకి వచ్చింది. ఆ తర్వాత వీరిద్దరూ ఔట్ కావడంతో కేకేఆర్ మళ్లీ మ్యాచ్‌లోకి వచ్చింది. చివర్లో విప్రాజ్ నిగమ్ (19 బంతుల్లో 38 రన్స్) మెరుపులు మెరిపించినా.. అవి ఓటమి అంతరాన్ని తగ్గించాయే తప్పి ఓటమిని తప్పించలేకపోయాయి. దీంతో 20 ఓవర్లలో ఢిల్లీ 190/9కి పరిమితమైంది.

కేకేఆర్ బౌలర్లలో సునీల్ నరైన్ 3, వరుణ్ చక్రవర్తి 2, అంకుల్ రాయ్ 1, వైభవ్ అరోరా 1, ఆండ్రీ రసెల్ 1 వికెట్ తీశారు. ఈ ఫలితంతో టేబుల్ టాప్‌లోకి వెళ్లాలన్న ఢిల్లీ క్యాపిటల్స్ ఆశలు నెరవేరలేదు. ఆ జట్టు నాలుగో స్థానంలోనే ఉంది. కేకేఆర్ 10 మ్యాచ్‌లలో నాలుగింట్లో గెలిచి.. ప్లే ఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది.

## ఇంగ్లండ్ కెప్టెన్‌గా ఆల్‌రౌండర్..

### 12 ఏళ్ల ఎదురుచూపు ఫలించింది

**లండన్:** సీనియర్ ఆల్‌రౌండర్ నాట్ సీవర్ బ్రంట్ ఇంగ్లండ్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైంది. ఇప్పటివరకూ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న సీవర్.. హీథర్ నైట్ వారసురాలిగా త్వరలోనే సారథిగా బాధ్యతలు చేపట్టనుంది. గత కొంతకాలంగా బ్యాటుతో, బంతితో నిలకడగా రాణిస్తున్న సీవర్‌ను తదుపరి కెప్టెన్‌గా సెలెక్టర్లు ఎంపిక చేశారు. ఈ విషయాన్ని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు మంగళవారం వెల్లడించింది.






ఇన్ని రోజులు జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన ఈ ఆల్‌రౌండర్ కెప్టెన్సీ వరించడంపై సంతోషం వ్యక్తం చేసింది. ఎట్టకేలకు తన కల సాకారం అయిందని మురిసిపోతోందీ మూడు ఫార్మాట్లలో ఇంగ్లండ్‌కు వెన్నెముకలా నిలుస్తున్న సీవర్.

'ఇంగ్లండ్ మహిళల జట్టు కెప్టెన్‌గా ఎంపికైనందుకు చాలా గర్వంగా, సంతోషంగా ఉంది. ఇది నాకు గొప్ప గౌరవం. నేను ఎంతో కాలంగా ఈ రోజు కోసం ఎదురు చూస్తున్నాను. 2013లో ఇంగ్లండ్ తరఫున తొలి మ్యాచ్ ఆడాను. మైదానంలోకి దిగిన ప్రతిసారి జట్టు విజయం కోసం సర్వశక్తులు ఒడ్డాను. ఇప్పుడు కొత్త బాధ్యతలు చేపట్టబోతున్నా. కెప్టెన్‌గా ఇంగ్లండ్ టీమ్‌ను నడిపించేందుకు ఉత్సాహంగా ఉన్నాను. మళ్లీ జట్టును గెలుపు బాట పట్టిస్తాను' అని సీవర్ బ్రంట్ వెల్లడించింది.

ఆస్ట్రేలియా పర్యటనలో యాషెస్ సిరీస్‌లో హీథర్ నైట్ కెప్టెన్సీలోని ఇంగ్లండ్ దారుణంగా విఫలమైంది. ఆ ఓటమికి బాధ్యత వహిస్తూ హీథర్ నాయకత్వ బాధ్యతల నుంచి వైదొలిగింది. దాంతో, కొత్త సారథి వేట మొదలుపెట్టిన ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు వైస్ కెప్టెన్‌గా ఉన్న సీవర్ బ్రంట్ వైపు మొగ్గు చూపింది. త్వరలోనే వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌తో సీవర్ బ్రంట్‌కు తొలి సవాల్ ఎదురుకానుంది.

## ఐపీఎల్ రికార్డు బ్రేకర్‌కు రివార్డు



### 10 లక్షలు ఇవ్వనున్న బిహార్ సీఎం

**బిహార్:** ఐపీఎల్‌లో రికార్డు సెంచరీతో చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీపై ప్రశంసలు కురుస్తున్నాయి. టీమిండియా భవిష్యత్ స్టార్ అంటూ మాజీ క్రికెటర్లు 14 ఏళ్ల వైభవ్‌కు కితాబులిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అభినందనలు తెలిపారు. తమ రాష్ట్రం ఖ్యాతిని యావత్ ప్రపంచం విస్తరించిన వైభవ్‌కు ప్రైజ్‌మనీ ప్రకటించారు. చిన్నవయసులోనే రికార్డులు బద్ధలు కొట్టిన అతడికి రూ.10 లక్షల రికార్డు ఇస్తామని సీఎం వెల్లడించారు.

'వైభవ్ సూర్యవంశీకి అభినందనలు. ఐపీఎల్ చరిత్రలో రికార్డు సెంచరీ బాదిన అతడికి నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. తన శ్రమ, ప్రతిభతో ఐపీఎల్లో సంచలనంగా మారాడు. భారత క్రికెట్ జట్టుకు భవిష్యత్ తారగా ఆవతరించాడు. ఐపీఎల్‌లో వైభవ్ ప్రదర్శన పట్ల మేమంతా చాలా సంతోషంగా ఉన్నాం' అని నితీశ్ ప్రకటనలో తెలిపారు.

#### 12 ఏళ్లకే రంజీల్లో..

బిహార్‌కు చెందిన వైభవ్‌కు.. చిన్నప్పట్నుంచీ క్రికెట్ అంటే ఇష్టం. కోచ్ మనీశ్ ఓఝా సలహాలతో రాటుదేలిన ఈ కుర్రాడు 12 ఏళ్లకే రంజీల్లో అరంగేట్రం చేశాడు. బిహార్ తరఫున ఖతర్నాక్ ఇన్నింగ్స్‌లు ఆడి ఐపీఎల్ ఫ్రాంచైజీల దృష్టిలో పడ్డాడు. మెగా వేలంలో రాజస్థాన్ ఫ్రాంచైజీ అతడిని రూ.1.1 కోట్లకు కొన్నది. దాంతో, ఐపీఎల్‌లో అతి పిన్నవయస్కుడైన క్రికెటర్‌గా వైభవ్ రికార్డు నెలకొల్పాడు.

## తిప్పేసిన స్నేహ్ రానా..

### సఫారీలపై టీమిండియా జయభేరి

**కొలంబో:** ముక్కోణపు సిరీస్‌లో భారత అమ్మాయిలు జోరు చూపిస్తున్నారు. తొలి పోరులో శ్రీలంకను చిత్తుగా ఓడించిన టీమిండియా ఈసారి దక్షిణాఫ్రికాను మట్టికరిపించింది. ప్రేమదాస స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన 15 పరుగుల తేడాతో సఫారీలపై గెలుపొందింది. దాంతో, ఈ టోర్నీలో వరుసగా రెండో విజయం ఖాతాలో వేసుకుంది.

భారత జట్టు నిర్దేశించిన 277 పరుగుల ఛేదనలో ఓపెనర్ తంజిమ్ బ్రిట్స్(109) సెంచరీతో చెలరేగి జట్టును గెలుపు వాకిట నిలిపింది. అయితే.. ఆల్‌రౌండర్ స్నేహ్ రానా(5-43) కీలక వికెట్లు తీసి మ్యాచ్‌ను మలుపుతిప్పింది. దాంతో, ప్రత్యర్థిని భారత్ 261 పరుగులకే కట్టడి చేసింది. తన అద్భుత ప్రదర్శనతో జట్టుకు విజయాన్నందించిన రానా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైంది.



ఉతికేసిన ప్రతీకా, జెమీమా

వరల్డ్ కప్ సన్నాహకాల్లో ఉన్న భారత మహిళల జట్టు అదరగొడుతోంది. ముక్కోణపు సిరీస్‌లో వరుసగా రెండో విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో శ్రీలంకను ఓడించిన హర్మన్‌ప్రీత్ కౌర్.. దక్షిణాఫ్రికా నుంచి విజయాన్ని లాగేసుకుంది. తొలుత ఓపెనర్ ప్రతీకా రావల్(74) అర్ధ శతకంతో శుభారంభం ఇవ్వగా.. జెమీమా రోడ్రిగ్స్(41), కెప్టెన్ హర్మన్‌ప్రీత్(41)లు దంచేశారు. ఆఖర్లో రీచా ఘోష్(24) మెరుపులతో భారత్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 276 పరుగులు చేసింది.

భారీ ఛేదనలో సఫారీ జట్టు దీటుగా ఇన్నింగ్స్ ఆరంభించింది. ఓపెనర్లు లారా వొల్వార్డ్(43), తంజిమ్ బ్రిట్స్(109)లు భారత బౌలర్లకు చుక్కలు చూపిస్తూ ధాటిగా ఆడారు. దాంతో, తొలి వికెట్‌కు దక్షిణాఫ్రికా 140 రన్స్ జోడించింది పటిష్ట స్థితిలో నిలిచింది. అయితే.. లారాను ఔట్ చేసిన దీప్తి శర్మ బ్రేకిచ్చింది. ఆ తర్వాత బంతి అందుకున్న స్నేహ్ రానా(5-43) వరుసగా వికెట్లు తీసి ప్రత్యర్థిని ఒత్తిడిలో పడేసంది. దాంతో, మిడిలార్డర్ చేతులెత్తేయగా సఫారీలు 261 పరుగులకే ఆలౌటయ్యారు. భారత బౌలర్లలో శ్రీచరణి, దీప్తి శర్మ, అరుంధతీ రెడ్డిలు తలా ఒక వికెట్ల తీశారు.



# మేడం సార్.. మేడం అంతే!




టాకీస్: గత కొన్నేళ్లుగా పెద్దగా సినిమాల్లో కనిపించిని పూజా హెగ్డే మళ్లీ సినిమాల్లో బిజీ అవుతోంది. ఆమె నటించిన తాజా చిత్రం రెట్రో. సూర్య హీరోగా నటిస్తున్న ఈ సినిమా మే01న ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ సినిమా ప్రమోషన్లలో చీరతోనే కనిపిస్తోంది బుట్ట బొమ్మ. సాధారణంగా పూజా హెగ్డే ఎక్కువగా మోడ్రన్, ట్రెండీ దుస్తుల్లోనే దర్శనమిస్తుంది. అయితే ఈ మధ్యన ట్రెడిషనల్ శారీలోనే ఎక్కువగా కనిపిస్తోంది బుట్ట బొమ్మ. గత కొన్ని రోజులుగా రెట్రో సినిమా ప్రమోషన్లలో భాగంగా వరుసగా ఇంటర్వ్యూల్లో పాల్గొంటోంది పూజ. ఈ సమయాల్లో ఎక్కువగా చీరలోనే కనిపించింది. తాజాగా మరోసారి ట్రెడిషినల్ శారీలో తళుక్కుమంది బుట్ట బొమ్మ. అయితే ఈ చీరకు ఒక స్పెషాలిటీ ఉంది. అదేంటంటే.. ఇది వాళ్ల అమ్మమ్మ చీర. తాజాగా ఈ చీరను ధరించి ఆ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది పూజ 'సుమారు 70 ఏళ్ల కిందటి చీర ఇది. మా బామ్మ ఎంతో ప్రేమతో దీన్ని నాకు ఇచ్చింది' 'ఇది కట్టుకున్న క్షణం మా బామ్మతో నాకున్న అనుబంధం, నా చిన్నప్పటి జ్ఞాపకాలు నా మదిలో మెదిలాయి' అని ఈ ఫొటోలకు క్యాప్షన్ ఇచ్చింది పూజ. ప్రస్తుతం ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయి. 'సో క్యూట్.. మేడమ్ సార్ మేడమ్ అంతే'.. అంటూ నెటిజన్లు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.




# హిట్-3తో వస్తున్న నాని

**టాకీస్:** హ్యాట్రిక్ హిట్స్‌తో మంచి జోష్ మీదున్నాడు నాని. దసరా, సరిపోదా శనివారంతో హండ్రెడ్ క్రోర్ హీరోగా ఛేంజయిన న్యాచురల్ స్టార్ నుండి వస్తోన్న చిత్రం హిట్ 3. ఇప్పటి వరకు నాని కెరీర్‌లోనే మోస్ట్ వయెలెంట్ పిక్చర్‌గా రాబోతుంది. మే 1న థియేటర్లలోకి వచ్చేస్తున్నాడు అర్జున్ సర్కార్. ఇప్పటి వరకు ఈ సిరీస్ నుండి వచ్చిన టూఫిల్మ్స్ మంచి హిట్ కొట్టడంతో పాటు నాని హీరో కావడంతో హిట్ 3పై భారీ అంచనాలున్నాయి. అయితే హిట్ 3కి టఫ్ కాంపిటీషన్ ఇచ్చేందుకు హాలీవుడ్ తో పాటు కోలీవుడ్ చిత్రాలు వచ్చేస్తున్నాయి. సంక్రాంతి సీజన్ తర్వాత ఇప్పటి వరకు డ్రై సీజన్ నడిచింది. కొన్ని అడపా దడపా చిత్రాలు కొన్ని డబ్బింగ్ మూవీస్ సందడి చేశాయి. ఏప్రిల్ మొత్తం బాక్సాఫీస్ డల్ అయ్యింది. ఇప్పుడు మేలో వచ్చే సినిమాలపైనే హోప్స్. మేడేన వచ్చేస్తున్నాడు నాని. ఇదే సినిమాను పాన్ ఇండియా భాషల్లో డబ్ చేసి రిలీజ్ చేస్తున్నారు. అయితే సౌత్, నార్త్ బెల్టులో హిట్ 3తో కొన్ని సినిమాలు పోటీపడుతున్నాయి. ముందుగా సూర్య.. హిట్ 3కి పోటీగా రెట్రోను మల్టీ లాంగ్వేజ్‌లో సినిమాను దింపుతున్నాడు. అలాగే టూరిస్ట్ ఫ్యామిలీ తమిళనాడులో రెట్రోతో పాటు హిట్ 3కి పోటీగా రాబోతుంది. హిందీ బెల్ట్‌లో చూస్తే సీనియర్లు అజయ్ దేవగన్ 2018లో వచ్చిన సక్సెస్ ఫుల్ మూవీ రైడ్‌కు సీక్వెల్‌గా రైడ్ 2 మే 1న రిలీజ్ చేస్తున్నాడు. సంజయ్ దత్ ది భూత్నీ కూడా అదే రోజు భయపెట్టేందుకు వస్తోంది. ఈ సినిమాలకే పిచ్చ కాంపిటీషన్ ఉంటే హాలీవుడ్ నుండి థండర్ బోల్ట్స్ వివిధ భాషల్లో రిలీజౌతుంది. ఇంత టఫ్ కాంపిటీషన్ ఉన్నప్పటికీ.. డేర్ చేసి వస్తున్నాడు నాని. ఇప్పటికే విపరీతమైన ప్రమోషన్లను చేసిన న్యాచురల్ స్టార్. వీటికి తోడు ఐపీఎల్ ఉండనే ఉంది. మరీ ఇన్ని అవరోధాలను దాటుకుని నాని హిట్3 ఎలాంటి హిట్ కొడతాడో చూడాలి.

# చిత్రదర్శకురాలుకు అరుదైన గౌరవం

## ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీలో కపాడియాకు చోటు



**టాకీస్:** భారతీయ చలనచిత్ర దర్శకురాలు పాయల్ కపాడియాకి అరుదైన గౌరవం లభించింది. ప్రతిష్టాత్మక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 2025 జ్యూరీలో పాయల్ చోటు దక్కించుకున్నారు. గతేడాది పాయల్ దర్శకత్వంలో వచ్చిన 'ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్స అనే చిత్రం కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో గ్రాండ్ పిక్స్ అవార్డు గెలుచుకున్న విషయం తెలిసిందే. ముంబై, కొంకణ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం మహిళా స్నేహం, ప్రేమ ఆకాంక్షల గురించి రూపొందించబడింది. ఈ సినిమా విడుదలై ప్రశంసలు అందుకోవడమే కాకుండా.. 30 సంవత్సరాల తర్వాత కేన్స్ ఫెస్టివల్‌లో నిలిచిన మొదటి భారతీయ చిత్రంగా చరిత్ర సృష్టించింది. అయితే తాజాగా పాయల్ కపాడియా జ్యూరీ మెంబర్‌గా చోటు దక్కించుకుంది. ఈ వేడుకలో ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీ అధ్యక్షురాలిగా ఫ్రెంచ్ నటి జూలియెట్ బినోష్ వ్యవహరించనుండగా.. జ్యూరీలో పాయల్‌తో పాటు హాలీవుడ్ నటి హాలీ బెర్రీ, ఇటాలియన్ నటి ఆల్బా రోర్‌వాచర్, కొరియన్ దర్శకుడు హాంగ్ సాంగ్సూ, కాంగోలీస్ దర్శకుడు డైయెడో హమాడి, మెక్సికన్ దర్శకుడు కార్లోస్ రేగాడాస్, ఫ్రెంచ్-మొరాకన్ రచయిత్రి లీలా స్లిమాని కూడా సభ్యులుగా చోటు దక్కించుకున్నారు.

# హీరోల కోసం త్రివిక్రమ్ చూపు

## వెంకటేశ్‌తో చేస్తాడన్న ప్రచారం

**టాకీస్:** మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ పైనే అందరి చూపు ఉన్నా..ఆయన చూపు ఎవరి వైపు అన్నదే ఇప్పుడు చర్చ. నిత్యం పెద్ద హీరోలు, భారీ బడ్జెట్ సినిమాలతో త్రివిక్రమ్ కాంపౌండ్ కళకళలాడేది. కానీ ఇప్పుడు వెలవెల బోతోంది. త్రివిక్రమ్ తో సినిమా చేసేందుకు హీరోలు దొరకని పరిస్థితి. హీరో అంటే ఇక్కడ స్టార్ హీరోలండి బాబు. ఈ పరిస్థితి రావడానికి కారణం కూడా మన గురూజీనే. కేవలం స్టార్ హీరోలతో మాత్రమే సినిమాలు చేస్తానని పట్టుబడతాడు. అదే దెబ్బ కొట్టేసింది. ఎందుకంటే స్టార్ హీరోలు అందరూ పాన్ ఇండియా బడ్జెట్ లో



చేసేస్తున్నారు. పైగా రియలస్టిక్ సినిమాలకే జెండా ఊపుతున్నారు. క్లాస్ సినిమాలు తీసే త్రివిక్రమ్ కు ఇది అడ్డంకిగా మారింది. బన్నీతో సినిమా ఉంటుందని ప్రచారం జరిగినా.. అది ఇప్పట్లో ఉండేలా కనిపించలేదు. అట్లీ మూవీ అయ్యాకే ఉంటుంది. దానికి ఇంకో మూడేళ్లు పడుతుంది. అప్పటి దాకా ఖాళీగా ఉండటం కన్నా వెంకటేశ్ తో తీస్తే బెటర్ అంటున్నారు. కానీ దానికి త్రివిక్రమ్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావట్లేదు. త్రివిక్రమ్ తో చేయడానికి వెంకీ సిద్ధంగానే ఉన్నాడు. ప్రస్తుతం భారీ హిట్ తో ఖాళీగా ఉన్నాడు. కాబట్టి వెంకీతో మూవీ చేసి తానేంటూ త్రివిక్రమ్ నిరూపించుకుంటే బెటర్ అంటున్నారు ఆయన ఫ్యాన్స్. వెంకీ నటించిన ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలకు త్రివిక్రమ్ డైలాగులు రాశాడు. ఇద్దరి కాంబోలో వచ్చిన నువ్వు నాకు నచ్చావ్ పెద్ద హిట్. కాబట్టి మళ్లీ ఓ మూవీ చేస్తే బాగుంటుందని వీరి ఫ్యాన్స్ అంటున్నారు. మరి త్రివిక్రమ్ ఏం చేస్తాడో చూడాలి.




# ఎన్టీఆర్-నీల్ కాంబినేషన్ 2026 జూన్ రిలీజ్ అంటూ ప్రకటన

**టాకీస్:** ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ ఈ కాంబినేషన్లో సినిమా అనగానే అంచనాలు ఆకాశాన్నంటాయి. కెజియఫ్, సలార్ సినిమాల తర్వాత ప్రశాంత్ నీల్ చేస్తున్న సినిమా కావడం ఒకటైతే ఇది ఆయన డ్రీమ్ ప్రాజెక్ట్ అవడం టైగర్ ఫ్యాన్స్ ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. అత్యంత భారీ బడ్జెట్ పై తెరకెక్కుతున్న ఈ సినిమాలు టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తో పాటు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కన్నడ భామ రుక్మిణి వసంత్ హీరోయిన్ గా నటిస్తుండగా రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.కాగా ఈ సినిమాను 2026 సంక్రాంతి కానుకగా రిలీజ్ చేస్తామని పూజా కార్యక్రమాలు నిర్వహించిన రోజు ప్రకటించారు మేకర్స్. కానీ అనుకోని కారణాల కారణంగా షూటింగ్ వాయిదా పడుతూ వస్తుండడం, మధ్యలో వార్ 2కు ఆగష్టులో ప్రమోషన్స్ కోసం డేట్స్ ఇవ్వాల్సి ఉండడం వంటి కారణంగా ఈ సినిమా సంక్రాంతికి రాదు అనే వాదనలు వినిపించాయి. ఆ వాదనలకు తెరదించుతూ న్యూ రిలీజ్ డేట్ ను ప్రకటించారు మేకర్స్. 2026 జూన్ 25న ఎన్టీఆర్ నీల్ సినిమాను రిలీజ్ చేస్తామని అనౌన్స్ చేసారు. అలాగే యంగ్ టైగర్ పుట్టిన రోజు కానుకగా మే 20న న ఎన్టీఆర్, నీల్ సినిమా గ్లిమ్స్ రిలీజ్ చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. వారం క్రితం యంగ్ టైగర్ ఈ సినిమా సెట్స్‌లో పాల్గొన్నారు.

# శ్రీలీలకు పోటీగా వస్తున్న రూపా కొడువాయూర్..




టాకీస్: రూపా కొడువాయూర్ .. ఈ యంగ్ హీరోయిన్ ఇప్పుడు టాలీవుడ్ లో క్రేజ్ సొంతం చేసుకుంది.. ఆమె 2000 డిసెంబర్ 27న ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జన్మించింది. వృత్తిరీత్యా ఫిజియోథెరపిస్ట్ అయిన రూపా, కటూరి మెడికల్ కాలేజీ నుండి ఎంబిబిఎస్ పట్టా పొందింది. ఈ చిన్నది కూచిపూడి , భరతనాట్యంలో శిక్షణ పొందిన నృత్యకారిణి కూడా రూపా తన నటనా ప్రస్థానాన్ని 2020లో "ఉమామహేశ్వర ఉగ్రరూపస్య" చిత్రంతో ప్రారంభించింది, ఈ చిత్రంలో ఆమె నటనకు సైమా అవార్డు - ఉత్తమ మహిళా అరంగేట్రం అందుకుంది. ఈ చిత్రం ఆమెకు విమర్శకులు, ప్రేక్షకుల ప్రశంసలు అందించింది.

ఆ తర్వాత ఆమె "మిస్టర్ ప్రెగ్నెంట్" చిత్రంలో నటించి మరింత గుర్తింపు పొందింది. ఇటీవల, ఆమె ప్రియదర్శితో కలిసి "సారంగపాణి జాతకం" చిత్రంలో నటించింది. రీసెంట్ గా విడుదలైన ఈ సినిమా మంచి టాక్ సొంతం చేసుకుంది. ఈ చిత్రం శ్రీదేవి మూవీస్ బ్యానర్‌పై మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో రూపొందింది. నటనతో పాటు, రూపా ఫ్యాషన్‌లో కూడా తనదైన ముద్ర వేసింది. ఆమె ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్‌లో ఆకట్టుకునే ఫ్యాషన్ లుక్స్‌ను పంచుకుంటుంది, ఇందులో ధోతీ శారీ, నెటెడ్ శారీలు, ఫ్రిల్డ్ టాప్‌లు వంటివి ఉన్నాయి.

ఆమె తన సహజమైన అందం మరియు అభినయంతో తెలుగు చిత్రసీమలో అవకాశాలు అందుకుంటూ దూసుకుపోతుంది. సోషల్ మీడియాలో రూప గురించి చర్చలు జరుగుతున్నాయి. ముఖ్యంగా "సారంగపాణి జాతకం" చిత్ర విజయం తర్వాత ఆమె శ్రీలీలాకు పోటీగా ఉంటుందని కొందరు అభిప్రాయపడుతున్నారు.

# వరుణ్ తేజ్..మేర్లపాక కాంబోలో మూవీ





**టాకీస్:** బ్యాక్ టు బ్యాక్ డిజాస్టర్స్ తో డౌన్ ఫాల్ లో ఉన్నాడు మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్. ఎన్నో ఆశలు పెట్టుకున్న మట్కా మొదటి ఆటకే మకాం సర్దేసింది. దీంతో కాస్త గ్యాప్ తీసుకుని కథలపై దృష్టి పెట్టిన ఈ మెగా హీరో యంగ్ డైరెక్టర్ మేర్లపాక గాంధీ డైరెక్షన్ లో సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు కొరియన్ కనకరాజ్ అనే క్రేజీ టైటిల్ ఫిక్స్ చేసినట్టు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ లోని ఆచార్య సెట్ లో జరుగుతుంది. సినిమాలో వచ్చే ఐటమ్ సాంగ్ కోసం అక్కడ నిర్మించిన ప్రత్యేక సెట్స్ లో సాంగ్ షూట్ చేస్తున్నారు. ఈ కోసం హాట్ బ్యూటీని రంగంలోకి దింపుతున్నారు. హుషారు, బంగార్రాజు వంటి సినిమాలలో మెప్పించిన దక్షా నాగర్కర్ కొరియన్ కనకరాజ్ లో వరుణ్ తేజ్ తో కలిసి ఆడిపాడనుంది. లాంగ్ గ్యాప్ తర్వాత వస్తున్న వరుణ్ తేజ్ ఈ సినిమాతో స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వాలని భావిస్తున్నాడు. ఈ సినిమా కోసం వరుణ్ తేజ్ తైక్వాండో లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడు. వరుణ్ తేజ్ కెరీర్ లో 15వ సినిమాగా వస్తున్న ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తున్నాడు. మరి వరుణ్ ఆశను మేర్లపాక గాంధీ నెరవేరుస్తాడో లేదో రానున్న రోజుల్లో తెలుస్తుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.